ESTD : 1999
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY
ఉమ్మడి ఖమ్మం జిల్లా
శనివారం 28 నవంబర్ 2026 పేజీలు : 10

బస్తర్ యువత మహా యుద్ధం

- ఎన్ఎండీసీ నియామకాలపై బస్తర్ యువత మహా యుద్ధం
- నేడు కిరందూల్-బచేలి ప్రాజెక్టుల బంద్‌కు పిలుపు
- ఆందోళనకు సిద్ధమైంది, 'దంతేవాడ యువ బేరోజ్‌గార్ సంఘ్'



చర్ల, నవంబర్ 27(విజన్ ఆంధ్ర): జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్ఎండిసి) ఎల్1-ఎల్2 నియామక పరీక్షల తేదీలను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బస్తర్ ప్రాంత నిరుద్యోగ యువత ఆందోళనకు సిద్ధమైంది, 'దంతేవాడ యువ బేరోజ్‌గార్ సంఘ్' ఆధ్వర్యంలో 'మహా యుద్ధ్' పేరిట

మహిళా చైతన్యంతోనే సమాజ ప్రగతి

- నవీన కాలంలోనూ కొనసాగుతున్న వివక్ష
- మహిళా కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి
- ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో సెమినార్



ఖమ్మం అర్బన్ నవంబర్ 27 (విజన్ ఆంధ్ర). మహిళా చైతన్యంతోనే సమాజ ప్రగతి ముడిపడిందని మహిళా కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. మారుతున్న కాలమాన పరిస్థితులను తనకనుగుణంగా మార్చుకోవడం ద్వారా స్త్రీలు పురోగతి సాధించాలని ఆమె కోరారు. తెలంగాణ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ అనుబంధం) రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని శుక్రవారం స్థానిక మహిళా కళాశాలలో మారుతున్న సమాజం మహిళల పాత్ర ఎదురవుతున్న సవాళ్లు అనే అంశంపై

తాళ్లపెంట గ్రామంలో రీ-సర్వే భూసేకరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన,కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్



పెనుబల్లి, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర) పెనుబల్లి మండలం తాళ్లపెంట గ్రామంలో నిర్వహిస్తున్న భూ రీ-సర్వే పనులు మరియు (సాగునీటి ప్రాజెక్టు) భూసేకరణ ప్రక్రియను కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, IAS క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో కొనసాగుతున్న రీ-సర్వే పనుల పురోగతి, భూసేకరణకు సంబంధించిన భూముల వివరాలు, భూముల హద్దులు, సంబంధిత రికార్డులు మరియు క్షేత్రస్థాయి పరిస్థితులను అధికారులతో సమీక్షించారు. భూ రీ-సర్వే ప్రక్రియలో ఖచ్చితత్వం, పారదర్శకత పాటిస్తూ, రైతులకు మరియు భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే భూసేకరణ పనులను వేగవంతం చేయడంతో పాటు, భూసేకరణకు సంబంధించిన పెండింగ్ అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026 ఏర్పాట్లు వేగవంతం చేయాలి

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మం అర్బన్ నవంబర్ 27 (విజన్ ఆంధ్ర,)ప్రతిష్టాత్మక ఖేలో ఇండియా యూత్ గేమ్స్ - 2026 నిర్వహణకు సంబంధించి ఖమ్మం స్టేడియంలో జరుగుతున్న అభివృద్ధి మౌళిక సదుపాయాల పనులను తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ సహకార, చేనేత మరియు జౌళి శాఖల మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేడియం ఆవరణలో కొనసాగుతున్న వివిధ నిర్మాణ, ఆధునీకరణ పనుల పురోగతిని మంత్రి, అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. జాతీయ స్థాయి క్రీడలకు హాజరయ్యే క్రీడాకారులకు అలాగే క్రీడలను వీక్షించేందుకు వచ్చే క్రీడాభిమానులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని మౌళిక సదుపాయాలను అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణ నాటికి స్టేడియం సర్వాంగ సుందరంగా పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్దేశిత గడువులోగా పనులన్నీ పూర్తి చేసేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి టి. సునీల్ రెడ్డి ఖమ్మం నగర పాలక సంస్థ డిఇ ధరణి కుమార్ ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో ఉమ్మడి ఖమ్మం జిల్లా జోనల్ స్థాయి అండర్-17 క్రీడా ఎంపికలు ప్రారంభం

- రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ చాటాలి
- ఐటీడీఏ పీవో బి.రాహుల్



పాల్వంచ ప్రతినిధి నవంబర్ 27(విజన్ ఆంధ్ర) గిరిజన విద్యార్థిని విద్యార్థులు చదువుతోపాటు మీకు ఇష్టమైన క్రీడలలో పాల్గొని మీలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి అంతర్జాతీయ క్రీడలలో పాల్గొని పథకాలు సాధించి మీ పాఠశాలలకు మంచి పేరు తీసుకొని రావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. శుక్రవారం నాడు ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా జోనల్ స్థాయి ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల అండర్-17 బాలబాలికల క్రీడా పోటీలు, రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికలు కిన్నెరసాని మోడల్ స్పోర్ట్స్ స్కూల్ మైదానంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకొని తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో సాధన చేస్తూ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని పేర్కొన్నారు. మొదటి రోజు అండర్ 17లో కబడ్డీ, వాలీబాల్, కోకో, అథ్లెటిక్స్, క్యారమ్స్, చెస్, టెన్నికాయిట్, ఆర్చరీ లలో మంచి ప్రతిభ కలిగి నైపుణ్యం ప్రదర్శించిన బాల బాలికలను ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. శనివారం నాడు నవంబర్ 28 తేదీన అండర్ 14 ఉమ్మడి ఖమ్మం జిల్లాల జోనల్ స్థాయి బాల బాలికలు ఎంపికలు జరుగునున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం డిడి ట్రైబల్ వెల్ఫేర్ చందన, ఖమ్మం డిడి ట్రైబల్ వెల్ఫేర్ ఫిరంగి, స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాలరావు, ఏ టి డి వో లు చంద్రమోహన్, భారతి, రాధమ్మ,రమేష్, ఖమ్మం ఎసిఎంఓ రాములు,ఏఎస్ఓలు వెంకట్ నారాయణ, నాగేశ్వరరావు, రాంబాబు, రాంబాబు శంకర్రావు, హెచ్ ఎం యన్ చందు మరియు పిడి

డ్రగ్స్‌కు బానిసైతే జీవితం అంధకారం

- చదువుకు బానిసైతే భవిష్యత్తు బంగారం
- విద్యార్థులు మరకద్రవ్యాలకు దూరంగా ఉండాలి
- భద్రత,నేరాలపై అవగాహన కలిగి ఉండాలి
- పోక్సో చట్టం మీకు ఎల్లప్పుడూ అండగా ఉంటుంది
- నందిగామ సబ్ ఇన్స్పెక్టర్ దేవరాజు



నందిగామ:నవంబర్ 27(విజన్ ఆంధ్ర న్యూస్); విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసైతే జీవితం అంధకారమని,చదువుకు బానిసైతే భవిష్యత్తు బంగారమని,విద్యార్థులు మరకద్రవ్యాలకు దూరంగా ఉండి,భద్రత,నేరాలపై అవగాహన కలిగి ఉండాలని,మరకద్రవ్యాల నిర్మూలనకోసం కృషి చేసి డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని,నందిగామ ఎస్ఐ దేవరాజు అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం నందిగామ మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని చేగూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు శుక్రవారం నందిగామ పోలీసులు సైబర్ నేరాలు,ఆన్‌లైన్ మోసాల నివారణ,సోషల్ మీడియా,ట్రాఫిక్ నియమాలు,రహదారి భద్రతా చర్యలు,పోక్సో ఉల్లంఘనలు,బాలల రక్షణపై తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సుమారు 110 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ దేవరాజు మాట్లాడుతూ విద్యార్థులు సురక్షితంగా,బాధ్యతగా,అప్రమత్తంగా ఉండాలని చెడు అలవాట్లకు దూరంగా ఉండి,మంచి భవిష్యత్తు వైపు నడవాలని,అదే ఈ అవగాహన కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు. యువత,విద్యార్థులు క్షణికానందం కోసం మత్తుకు బానిసై మీ తల్లిదండ్రుల కలలను చిదిమేయవద్దన్నారు. మత్తుపదార్థాల వాడకం నేరం మాత్రమే కాదని, అది మీ కలలకు వేసే ఉరితాడని,మత్తును ద్వేషించి,పుస్తకాలను ప్రేమించి ఆదర్శవంతమైన పౌరులుగా ఎదగలన్నారు. అదేవిధంగా విద్యార్థి విద్యార్థినులు మంచి స్పర్శ,చెడు స్పర్శ తెలుసుకోని,మీ భద్రతకు మీరే రక్షకులు కావాలన్నారు. భయపడకుండ,మౌనంగా ఉండకుండ ఏదైనా ఇబ్బంది ఎదురైతే వెంటనే తమ తల్లిదండ్రులకు లేదా 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్) / 100 కు ఫోన్ చేయాలన్నారు. ఆడపిల్లల జోలికి వస్తే కఠిన శిక్షలు తప్పదని, బాలల హక్కుల రక్షణకు పోక్సో చట్టం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని,పోక్సో చట్టం ఎవరినీ వదిలిపెట్టదన్నారు.తప్పు చేయడానికి భయపడాలి కానీ,జరిగిన అన్యాయాన్ని బయటకు చెప్పడానికి భయపడకూడదన్నారు.అదేవిధంగా అపరిచితుల ఫ్రెండ్ రిక్వెస్ట్‌లకు దూరంగా ఉండలని,సోషల్ మీడియా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు.మీ వ్యక్తిగత ఫోటోలు, ఓటీపీ (ఓూా) మరియు పాస్‌వర్డ్‌లను ఎవరితోనూ పంచుకోవద్దని,సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దాన్ని,ఆన్‌లైన్ మోసాలపై వెంటనే 1930 నంబర్ కు ఫిర్యాదు చేయలన్నారు.అదేవిధంగా చదువుకునే పాఠశాలలో ర్యాగింగ్ భూతాన్ని తరిమికొట్టి,స్నేహపూర్వక వాతావరణాన్ని నిర్మించుకోవాలని సూచించారు.పోలీసులు మీ మిత్రులుగా భావించి ఆపద సమయంలో నిర్భయంగా 100 / 112 నంబర్ లకు ఫోన్ చేయాలని సూచించారు.విద్యార్థులు ఈ మూడు ముఖ్యమైన నంబర్లను 112 ఎమర్జెన్సీ హెల్ప్ లైన్,1930 సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్,1908 యాంటీ డ్రగ్ హెల్ప్ లైన్ నంబర్లను గుర్తుంచుకోవాలని,ఏదైనా సమస్య వస్తే వెంటనే ఈ నంబర్లకు కాల్ చేయాలని సబ్ ఇన్స్పెక్టర్ దేవరాజ్ సూచించారు.ఈ కార్యక్రమంలో పెట్రో మొబైల్ సిబ్బంది పోలీస్ కానిస్టేబుల్ బాలకృష్ణ, శ్రీశైలం(విపిఓ చేగూర్) క్రైమ్ శ్రీశైలం పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు.

బస్తర్ యువత మహా యుద్ధం

(మొదటి పేజీ తరువాయి..)

నవంబర్ 28న (శనివారం) పెద్ద ఎత్తున నిరసన చేపట్టనున్నారు, లక్ష మందికి పైగా అభ్యర్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ పరీక్షల తేదీని తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మూడు జిల్లాలకు చెందిన యువత ఈ ఉద్యమంలో పాల్గొననున్నారు. యాజమాన్యం స్పందించకపోతే కిరందూల్-బచేలి ప్రాజెక్టుల కార్యకలాపాలను పూర్తిగా బంద్ చేయిస్తామని నిరుద్యోగ సంఘం హెచ్చరించింది, మరోవైపు, ఆందోళనల పేరుతో శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, చట్టాన్ని ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు యంత్రాంగం స్పష్టం చేసింది, శనివారం నిరసన నేపథ్యంలో దంతేవాడ, కిరందూల్, బచేలి ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ఎన్ఎండిసి ప్రధాన ఉద్దేశం

నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇది భారత ప్రభుత్వ ఉక్కు మంత్రిత్వ శాఖ ఆధీనంలో పనిచేసే ఒక ప్రధాన నవరత్న ప్రభుత్వ రంగ సంస్థ,దీని ప్రధాన ఇనుప ఖనిజ గనులు ఛత్తీస్‌గఢ్‌లోని బైలడిలా (కిరందూల్, బచేలి ప్రాంతాలు) మరియు కర్ణాటకలోని దోణిమలై ప్రాంతాలలో ఉన్నాయి, దీని ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లో ఉంది, భారతదేశంలో అతిపెద్ద ఇనుప ఖనిజం (ఐరన్ వోర్) ఉత్పత్తిదారు మరియు ఎగుమతిదారు, ఇనుప ఖనిజంతో పాటు రాగి, రాక్ ఫాస్ఫేట్, లైమ్‌స్టోన్, వజ్రాలు (పన్నా గనులు) వంటి ఖనిజాల అన్వేషణ, తవ్వకాలు నిర్వహిస్తుంది. ఈ సంస్థ పై లక్షల మంది నిరుద్యోగులు ఉపాధి పొందుతున్నారు, గత కొన్నేళ్లుగా ఈ సంస్థలో ఉద్యోగ ప్రకటన జారీ కాకపోవడం నిరుద్యోగుల సంఖ్య పెరగడం తో నిరసన కార్యక్రమం చత్తీస్‌గడ్ రాష్ట్రంలో ప్రారంభమైంది.

మహిళా చైతన్యంతోనే సమాజ ప్రగతి

(మొదటి పేజీ తరువాయి..)

సెమినార్ నిర్వహించారు. మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బత్తినేని నీరజ -అధ్యక్షతన జరిగిన సెమినార్కు ముఖ్య వక్తగా హాజరైన ప్రిన్సిపాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ సమాజ పరిణామ క్రమంలో మార్పు అనివార్యమని ప్రతి మార్పును తమకు సానుకూలంగా మార్చుకోవాలని ఆమె సూచించారు. పెరిగిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం నేపథ్యంలో మహిళలు పురుషులకు సమానంగా ఆర్థిక, రాజకీయ సామాజిక సేవా రంగాల్లో పనిచేస్తున్నప్పటికీ వివక్ష కొనసాగుతుండటం అత్యంత =బాధాకరమన్నారు. స్త్రీకి స్వేచ్ఛ ఇచ్చినట్లుగానే లేదా ఉన్నట్లుగానే కనిపిస్తుంది కానీ ఆ స్వేచ్ఛకు ఎక్కడో బంధనాలు ఉన్నాయని ఆ బంధనాలను మహిళా చైతన్యంతోనే తెంచగలమని విజయలక్ష్మి స్పష్టం చేశారు. పురాణాల నుండి నేటి వరకు సమాజానికి వెన్నుముక స్త్రీ మాత్రమేనని మార్పును స్వాగతించడంలోనూ ఆ మార్పును సమాజానికి, కుటుంబానికి అన్వయించడంలోనూ స్త్రీ పాత్ర వెలకట్టలేనిదన్నారు. నిరంతరం చైతన్యవంతమైన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా మహిళా చైతన్యం తద్వారా సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లను -అధిగమించవచ్చునని ఆమె తెలిపారు. మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి నెదునూరి జ్యోతి మాట్లాడుతూ ఎన్ఎఫ్ఎడబ్ల్యూ అనే దశాబ్దాలుగా -మహిళల సంక్షేమం, హక్కుల కోసం పోరాడుతుందన్నారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లుతో పాటు శ్రమకు తగినవేతనం. ఒకే పనికి ఒకే వేతనం, డిమాండ్తో బహుముఖ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ప్రస్తుతం మహిళలపై జరుగుతున్న దాడులు వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు. భవిష్యత్తు కార్యాచరణను నిర్వహించుకోవడంతో పాటు సామాజిక పరిస్థితులు రాజకీయాలు మొదలైనవి చర్చించుకునేందుకు మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలను డిసెంబర్ 27, 28, 29 తేదీలలో ఖమ్మంలో నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ సెమినార్లో మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన రాష్ట్ర నాయకురాలు పోటు కళావతి జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి నాయకులు మున్నా లక్ష్మి కుమారి. తాటి నిర్మల కోటమ్మ, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రాస్నం గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం


- ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే ధ్యేయం
- సర్పంచ్ కావలి సురేఖ స్పష్టం



యాలాల నవంబర్ 27(విజన్ ఆంధ్ర): యాలాల మండలంలోని రాస్నం గ్రామపంచాయతీలో శుక్రవారం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభించే కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి లక్ష్మి ఏర్పాటు చేశారు. ఇట్టి సమావేశానికి ముఖ్యఅతిగా స్థానిక సర్పంచ్ కావాలి సురేఖ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఉచిత జీవిత బీమా రక్షణ కల్పిస్తారు అని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రణాళికతో బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారని అన్నారు. రేషన్ కార్డు కల్గిన ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా దరఖాస్తు ఫారాలు తప్పకుండా నింపాలని స్థానిక ఎమ్మెల్యే ఆదేశాలు ఉన్నట్లు ఆమె తెలియజేశారు. ఈ భీమకు సంబంధించిన పూర్తి ప్రీమియం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే బరుస్తుందని తెలిపారు. లబ్ధిదారులు ఎటువంటి డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తి ఈ పథకానికి అర్హులు అన్నారు. 18 నుండి 59 సంవత్సరాల వయస్సు ఉన్నవారు ఈ బీమాకు అర్హులని చెప్పారు. ఆహార భద్రత కార్డు ఆధారంగా కుటుంబ వివరాలను నమోదు చేస్తారని చెప్పారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబం నుండి ఒకరికి ఈ బీమా వర్తిస్తుందని అని తెలియజేశారు. వచ్చేనెల 18వ తేదీ వరకు ఈ బీమా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ఉన్నట్లు కావలి సర్పంచ్ సురేఖ వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శిరీష మధు గౌడ్, వార్డు సభ్యుడు మక్త వెంకటయ్య, వై, సాయన్న, కావాలి బాబు, ఖాజా పాషా, రమేష్ గౌడ్, డి, మల్లేశం, వెంగల్ రెడ్డి, జి, వీరన్న, పి.లక్ష్మారెడ్డి, బి, రాజు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాముల సేవలో పంజుగుల కుటుంబం

- ఘనంగా అయ్యప్ప స్వాములకు మహా ప్రసాద వితరణ
- భావిగి భద్రేశ్వర ఆలయంలో అయ్యప్ప స్వామి సిద్ధి కార్యక్రమం
- భక్తులకు స్వయంగా మహా ప్రసాదం అందించిన పంజుగుల విఠల్ రెడ్డి కుటుంబ సభ్యులు



తాండూరు నవంబర్ 27 (విజన్ ఆంధ్ర) అయ్యప్ప స్వాముల సేవలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి సతీమణి పంజుగుల ఆర్తి రెడ్డి అన్నారు. తాండూర్ పట్టణంలోని శ్రీ భావిగి భద్రేశ్వర దేవాలయంలో 36 వ వార్డ్ మున్సిపల్ కౌన్సిలర్ రూపా రుద్రు పాటిల్ గారి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ అయ్యప్ప స్వామి సిద్ధి (మహా ప్రసాదం) కార్యక్రమానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి తండ్రి పంజుగుల విఠల్ రెడ్డి గారు, మాతృమూర్తి పంజుగుల ప్రమోదిని రెడ్డి గారు, సతీమణి పంజుగుల ఆర్తి రెడ్డి గారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వందలాది మంది అయ్యప్ప స్వాములకు మహా ప్రసాదం స్వయంగా అందించారు. అనంతరం స్వాములతో కలిసి సహపంక్తి భోజనం చేసి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పంజుగుల ఆర్తి రెడ్డి మాట్లాడుతూ.. అయ్యప్ప స్వాముల సేవ చేసుకునే అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. స్వామివారి ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అయ్యప్ప స్వాముల భక్తి, క్రమశిక్షణ, సేవాభావం అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజు గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సాయిపూర్ నర్సింలు, శ్రీనివాస్ చారి, వెంకట్ రెడ్డి, తాండూర్ పట్టణ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరుకుల నరేందర్ గౌడ్‌తో పాటు బీఆర్ఎస్వీ నాయకులు దత్తు, సందీప్ కొర్రా, వినోద్, అశ్వక్, సోహెల్, అబ్రార్ లాల, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో ఉమ్మడి ఖమ్మం జిల్లా జోనల్ స్థాయి అండర్-17 క్రీడా ఎంపికలు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి..)



బాలసుబ్రమణ్యం, నగేష్ సైదులు, మోతిలాల్, హరి కృష్ణ వెంకన్న, శిరోమణి, ప్రత్యూష,నాగమణి, కోచస్ నాగరాజు, ప్రసాద్, హత్తిరామ్ మరియు వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు రేషన్ కార్డులా?

- టేకులపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఏం జరుగుతోంది.?
- ఉద్యోగుల కుమారుల పేర్లపై కార్డులు మంజూరయ్యాయనే ఆరోపణలు
- అర్హులైన పేదలకు న్యాయం జరుగుతోందా?
- దరఖాస్తుల పరిశీలనలో అధికారుల పాత్రపై అనుమానాలు
- జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజల డిమాండ్



టేకులపల్లి నవంబర్ 27(విజన్ ఆంధ్ర) ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందాల్సింది పోయి, అనర్హులకు చేరుతున్నాయా? టేకులపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ కార్డుల మంజూరు వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్న కుటుంబాలకు చెందిన కుమారుల పేర్లపై రేషన్ కార్డులు మంజూరయ్యాయనే సమాచారం స్థానికంగా అనుమానాలకు తావిస్తోంది.ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాల ఆర్థిక పరిస్థితి, ఆదాయ వివరాలు, కుటుంబ విభజన తదితర అంశాలను పరిశీలించకుండా కార్డులు మంజూరు చేశారా? లేక నిబంధనల ప్రకారమే అర్హతలను నిర్ధారించి మంజూరు చేశారా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

దరఖాస్తుల పరిశీలన ఎక్కడ.?

రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునే పేద కుటుంబాలు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న పరిస్థితులు కనిపిస్తుండగా, ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబ సభ్యుల పేర్లపై కార్డులు మంజూరయ్యాయనే సమాచారం రావడం చర్చకు దారితీస్తోంది. దరఖాస్తుదారుల ఆదాయ వివరాలు, కుటుంబ సభ్యుల వివరాలు, నివాస పరిస్థితులు, అర్హతలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారా? పరిశీలించినట్లయితే సంబంధిత నివేదికలు ఎక్కడ ఉన్నాయి?

అధికారుల పర్యవేక్షణ ఏమైంది.?

రేషన్ కార్డుల మంజూరులో తహసీల్దార్ కార్యాలయ అధికారులు ఏ విధమైన తనిఖీలు చేపట్టారు? ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబ సభ్యుల దరఖాస్తుల విషయంలో ప్రత్యేకంగా అర్హతలను పరిశీలించారా? ఒకే కుటుంబంలో ఉంటూ వేర్వేరు కార్డులు పొందిన సందర్భాలు ఉన్నాయా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.ప్రభుత్వ ఉద్యోగి కుమారుడైనంత మాత్రాన రేషన్ కార్డుకు అనర్హుడని చెప్పలేం. అయితే కుటుంబ విభజన, ఆదాయ పరిమితులు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హతలు నిర్ధారించారా లేదా అన్నది అధికారిక రికార్డుల ద్వారా తేలాల్సి ఉంది.

జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలి.!

ఈ వ్యవహారంపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. టేకులపల్లి మండలంలో ఇటీవల మంజూరైన రేషన్ కార్డులపై సమగ్ర పరిశీలన చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా కార్డులు మంజూరైనట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. అర్హులైన పేదలకు అన్యాయం జరగకుండా పారదర్శకతను నిర్ధారించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హతల విషయంలో నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది.

ఎంపీ వద్దిరాజు ఎమ్మెల్సీ మధుతో కలిసి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



ఖమ్మం అర్బన్ నవంబర్ 27 (విజన్ ఆంధ్ర) ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్)చెక్కుల మంజూరులో తీవ్ర వివక్ష కొనసాగుతున్నదని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మండిపడ్డారు.అనారోగ్యానికి గురైన పేద వర్గాల వారికి అవసరమైన వైద్య సేవల కోసం సాయమందించడం సీఎంఆర్ఎఫ్ పథకం ఏర్పాటు ముఖ్యోద్దేశమన్నారు.అయితే,ఈ పథకం కింద నిధులు మంజూరు చేయడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీవ్ర వివక్ష ప్రదర్శిస్తుండడం బాధాకరమన్నారు. ఖమ్మం తెలంగాణ భవన్ లో శుక్రవారం ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ సిఫార్సుతో మంజూరైన 86 చెక్కుల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో మధుతో కలిసి రవిచంద్ర పాల్గొని మాట్లాడుతూ, కాంగ్రెస్ సర్కార్ వైఖరిని దుయ్యబట్టారు.దరఖాస్తు చేసిన తర్వాత వాటి పరిశీలన కేటాయింపు మంజూరు,చెక్కుల ప్రింటింగ్ విడుదలకు ఈ ప్రభుత్వం చాలా సమయం తీసుకుంటున్నదని విమర్శించారు.ప్రధాన ప్రతిపక్షానికి చెందిన ప్రజాప్రతినిధుల సిఫార్సుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారని వివక్ష కొనసాగుతున్నదని. చాలా తక్కువ శాతం డబ్బులు మంజూరవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పదేళ్ల పాలనలో సీఎంఆర్ఎఫ్ నిధుల మంజూరులో ఎటువంటి వివక్షకు పక్షవాతానికి తావులేకుండా ప్రజాప్రతినిధులందరి సిఫార్సులను సమ దృష్టితో చూడడం జరిగిందని ఎంపీ రవిచంద్ర చెప్పారు.ఆ విధంగా సీఎంఆర్ఎఫ్ ద్వారా ఖమ్మం జిల్లా పేదలు. రోగులకు వందల కోట్ల రూపాయల సాయమందిందన్నారు.రాజకీయాలకు అతీతంగా పక్షపాతానికి తావులేకుండా మానవీయ కోణంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు చేయాల్సిందిగా దరఖాస్తు చేశాక వీలైనంత తొందరగా పరిష్కరించాల్సిందిగా ప్రభుత్వాన్ని ఎంపీ వద్దిరాజు కోరారు.

ఇందిరమ్మ బీమా ప్రతి ఇంటికి ఒక ధీమా!

- బీమా రసీదు అందిస్తే లబ్ధిదారులకు మరింత భరోసా
- ఇందిరమ్మ కుటుంబ బీమా క్యాంపును ప్రారంభించిన 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ

కొత్తగూడెం బ్యూరో, నవంబర్ 27(విజన్ ఆంధ్ర) కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరమని కొత్తగూడెం కార్పొరేషన్ 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని రామవరం 16వ డివిజన్‌లో స్థానిక నేతాజీ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన ఇందిరమ్మ కుటుంబ బీమా క్యాంపునకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై పథకాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మునిగడప పద్మ మాట్లాడుతూ.. కుటుంబ యజమానిని కోల్పోయినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రతి అర్హ కుటుంబానికి ఈ పథకం ద్వారా భరోసా కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యం అభినందనీయమన్నారు.ప్రజా ప్రభుత్వంలో భాగస్వాములైన సీపీఐ స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రులకు తమ తరఫున, డివిజన్ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.ఇందిరమ్మ కుటుంబ బీమా పథకంలో ఒక చిన్న లోటు కనిపిస్తోందని, బీమా నమోదు చేసుకున్న లబ్ధిదారులకు రసీదు అందజేస్తే మరింత భరోసా కలుగుతుందని మునిగడప పద్మ సూచించారు. బీమా నమోదు చేసినట్లు ఆధారంగా రసీదు అందించడం వల్ల లబ్ధిదారుల్లో నమ్మకం పెరుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో మాజీ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ రవికుమార్, కృష్ణ, శ్రీరాములు, వార్డు ఆఫీసర్ శివరాం, శ్రీకాంత్, ప్రభాకర్, కంప్యూటర్ ఆపరేటర్ స్వప్న, ఆర్‌పీ కవిత, లబ్ధిదారులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు, ఎమ్మెల్యే మట్టా రాగమయి చిత్రపటాలకు పాలాభిషేకం

- వేంసూరులో 101 నూతన పింఛన్ల మంజూరుపై నూతన పింఛన్ లబ్ధిదారుల హర్షం



వేంసూరు నవంబర్ 27 (విజన్ ఆంధ్ర) వేంసూరు గ్రామంలో నూతనంగా 101 పింఛన్లు (వితంతు, ఒంటరి మహిళ, దివ్యాంగులు, గీత కార్మికుల పింఛన్లు) మంజూరు కావడంపై లబ్ధిదారులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎండీ ఫకృద్దీన్ ఆధ్వర్యంలో నూతన పింఛన్ లబ్ధిదారులు స్వయంగా తరలివచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ చిత్రపటాలకు ఘనంగా పాలాభిషేకం నిర్వహించారు.అత్యధిక సంఖ్యలో అర్హులైన పేదలకు పింఛన్లు మంజూరు చేయించడంలో ప్రత్యేక చొరవ చూపిన సర్పంచ్ ఎండీ ఫకృద్దీన్‌కు లబ్ధిదారులు, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.?ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లెల్లి నరసింహాస్వామి, ఏఎంసీ డైరెక్టర్ ఇబ్రహీం, లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ ఇబ్రహీం, జనరల్ సెక్రటరీ వేల్పుల నవకుమార్, రహీం, మాజీ ఉప సర్పంచ్ మల్లెల్లి నాగేశ్వరరావు, శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ESTD : 1999 విజన్ ఆంధ్ర తెలుగు దినపత్రిక

శనివారం 28 నవంబర్ 2026

అభివృద్ధి ఎక్కడ..? ఆదివాసీల బతుకులు ఎప్పుడు మారేను.?

- 48 మంది ఓటర్లు ఉన్నా పట్టించుకునే నాథుడే లేడా..?

- రోడ్లు లేవు.. తాగునీరు లేదు.. వీధిలైట్లు లేవు.. నిలువ నీడకు పక్కా ఇళ్లు లేవు..!

- అటవీ శాఖ నుంచి ఇళ్లు ఖాళీ చేయాలనే ఒత్తిళ్లు..

- మరోవైపు దళారుల చేతుల్లో ఆదివాసీ కూలీల శ్రమ దోపిడీ..!

- అధికారుల క్షేత్రస్థాయి పర్యటన కోసం ఎదురుచూస్తున్న రమణక్కపేట కాలనీ ప్రజలు



విజన్ ఆంధ్రా (నవంబర్ 28) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గ ప్రతినిధి,అశ్వారావుపేట : ప్రభుత్వాలు మారుతున్నాయి.. పాలకులు మారుతున్నారు.. అభివృద్ధి పేరుతో ఎన్నో హామీలు వినిపిస్తున్నాయి.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని పాలనా యంత్రాంగం చెబుతోంది. కానీ మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీ కుటుంబాల జీవితాల్లో మాత్రం కనీస మార్పు కనిపించడం లేదు. ఇప్పటికీ రోడ్డు, తాగునీరు, విద్యుత్, గృహ వసతి వంటి ప్రాథమిక అవసరాల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం కోయ రంగాపురం గ్రామపంచాయతీ పరిధిలోని రమణక్కపేట కాలనీ పరిస్థితి ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. సుమారు 20 కుటుంబాలు, 56 మంది జనాభా, 48 మంది ఓటర్లు నివసిస్తున్న ఈ కాలనీలో నేటికీ కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులో లేవని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కలిగి ఉన్నప్పటికీ, కనీస సౌకర్యాలు పొందడంలో మాత్రం తమకు న్యాయం జరగడం లేదని వారు వాపోతున్నారు.

రోడ్డు లేక అవస్థలు.. అత్యవసర సమయంలో అష్టకష్టాలు!

ఒక గ్రామం అభివృద్ధి చెందిందా లేదా అనేది అక్కడి రహదారులను చూస్తే తెలుస్తుంది. కానీ రమణక్కపేట కాలనీలో సరైన రహదారి సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు చెబుతున్నారు. వర్షాకాలంలో రాకపోకలు మరింత కష్టతరంగా మారుతున్నాయని, నిత్యావసర సరుకులు తీసుకురావడం నుంచి వ్యవసాయ పనులకు వెళ్లడం వరకు ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు.అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఆసుపత్రికి తరలించాల్సిన పరిస్థితి వచ్చినప్పుడు రహదారి సౌకర్యం లేక అవస్థలు పడాల్సి వస్తోందని చెబుతున్నారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నపిల్లల పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంటోందని గ్రామస్తులు వివరిస్తున్నారు. అత్యవసర సమయంలో అంబులెన్స్ లేదా ఇతర వాహనాలు సులభంగా చేరుకోలేని పరిస్థితి ఉంటే బాధ్యత ఎవరిది? అనే ప్రశ్న స్థానికుల నుంచి వినిపిస్తోంది.

గుక్కెడు మంచినీటి కోసం ఎదురుచూపులు!

ప్రతి మనిషికి స్వచ్ఛమైన తాగునీరు ప్రాథమిక అవసరం. కానీ రమణక్కపేట కాలనీలో మంచినీటి సౌకర్యం సక్రమంగా లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోందని, మహిళలు కుటుంబ అవసరాల కోసం నీటిని సమకూర్చుకోవడంలో శ్రమించాల్సి వస్తోందని చెబుతున్నారు.ఒకవైపు ప్రభుత్వం ప్రతి ఇంటికి తాగునీరు అందించాలనే లక్ష్యంతో పథకాలు అమలు చేస్తుంటే, మరోవైపు ఈ కాలనీ ప్రజలకు కనీస నీటి సౌకర్యం ఎందుకు అందడం లేదనే ప్రశ్న తలెత్తుతోంది. సంబంధిత గ్రామీణ నీటి సరఫరా అధికారులు కాలనీని సందర్శించి నీటి అవసరాలు, అందుబాటులో ఉన్న వనరులను పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

రాత్రయితే చీకటే దిక్కు.. వీధిలైట్లు ఎక్కడ?

కాలనీలో వీధిలైట్లు లేకపోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు చీకట్లోనే జీవనం సాగించాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. చీకటి కారణంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు బయటకు రావడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాములు, విషపురుగుల భయం కూడా ఉంటోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఒకవైపు విద్యుత్ సౌకర్యం ఆధునిక జీవనంలో కీలకంగా మారుతుంటే, మరోవైపు కాలనీలో వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడం అధికారుల దృష్టికి రావాల్సిన అంశం. గ్రామపంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సొంత గూడు కోసం ఎదురుచూపులు.. నిలువ నీడకూ భరోసా లేదు..?

మనిషికి కనీసం తలదాచుకునేందుకు ఒక ఇల్లు ఉండాలి. కానీ రమణక్కపేట కాలనీలోని పేద కుటుంబాలకు సరైన గృహ వసతులు కూడా లేవని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ గృహ పథకాల ద్వారా అర్హులైన కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయాలని ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారు.ఇదిలా ఉండగా, తమ నివాసాలను ఖాళీ చేయాలని స్థానిక అటవీ శాఖ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే సరైన గృహ వసతులు లేక ఇబ్బందులు పడుతున్న తమను ఇళ్లు ఖాళీ చేయాలని కోరడం మరింత ఆందోళనకు గురిచేస్తోందని వాపోతున్నారు.తమ నివాసాలకు సంబంధించి అటవీ భూమి హక్కులు, పూర్వపు నివాస వివరాలు, అర్హతలు, సంబంధిత రికార్డులను పరిశీలించకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని గ్రామస్తులు కోరుతున్నారు. అటవీ హక్కుల చట్టం, వర్తించే నిబంధనల ప్రకారం ప్రతి కుటుంబం వాదనను పరిశీలించి, చట్టబద్ధమైన ప్రక్రియ పాటించాలని ఉన్నతాధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.ఈ అంశంపై జిల్లా అటవీ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

చదువుకు దూరంగా చిన్నారులు.. వైద్యానికి కిలోమీటర్ల ప్రయాణం!

విద్య, వైద్యం ప్రతి పౌరుడికి అందుబాటులో ఉండాల్సిన ప్రాథమిక హక్కులు. కానీ ఈ కాలనీకి సమీపంలో పాఠశాలలు, ఆసుపత్రులు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. చిన్నారులు చదువుకోవాలంటే దూరప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. రవాణా సౌకర్యాలు సక్రమంగా లేకపోతే విద్యార్థులపై అదనపు భారం పడుతోంది.అలాగే అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు వైద్య సేవలు పొందేందుకు దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. చిన్నపిల్లలకు జ్వరం వచ్చినా, వృద్ధులకు అనారోగ్యం కలిగినా కుటుంబ సభ్యులు ఆందోళన చెందాల్సి వస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు.కాలనీకి సమీపంలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం, వైద్య సిబ్బంది పర్యటనలు చేపట్టడం, విద్యార్థులకు రవాణా సౌకర్యాలు కల్పించడం వంటి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు ఏవీ? కూలి పనులే జీవనాధారం!

కాలనీలోని యువతకు సరైన ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అందుబాటులో లేకపోవడంతో వ్యవసాయ పనులు, వ్యవసాయ కూలి పనులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు.చదువుకు, ఉద్యోగాలకు, ఆధునిక ఉపాధి అవకాశాలకు దూరంగా ఉంటున్న యువత తమ కుటుంబాలను పోషించేందుకు ప్రతిరోజూ కష్టపడాల్సి వస్తోంది. ప్రభుత్వ శాఖలు గిరిజన యువతకు అందించే ఉపాధి శిక్షణ, స్వయం ఉపాధి పథకాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఈ ప్రాంతానికి చేరుతున్నాయా లేదా అనే అంశంపై అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

రూ.300 నుంచి రూ.350 కూలీ.. శ్రమకు తగిన ప్రతిఫలం దక్కుతోందా?

ఈ కాలనీ ప్రజల సమస్యల్లో మరో కీలక అంశం కూలి పనుల వ్యవహారం. రోజంతా కష్టపడి వ్యవసాయ పనులు చేస్తున్నప్పటికీ రూ.300 నుంచి రూ.350 వరకు మాత్రమే కూలి లభిస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు. కొందరు దళారీలు మధ్యవర్తిత్వం చేస్తూ కూలీల శ్రమకు తగిన ప్రతిఫలం దక్కకుండా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.పేదరికం, ఉపాధి అవకాశాల కొరతను ఆసరాగా చేసుకుని కూలీల అవసరాలను కొందరు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణల్లో వాస్తవాలు ఎంతవరకు ఉన్నాయో సంబంధిత కార్మిక శాఖ అధికారులు విచారణ చేపట్టాలి. వ్యవసాయ కూలీలకు వర్తించే కనీస వేతన నిబంధనలు అమలవుతున్నాయా లేదా పరిశీలించాలి. పనికి తగిన న్యాయమైన వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

48 ఓట్లు.. అయినా అభివృద్ధి ఎందుకు కనిపించడం లేదు.?

రమణక్కపేట కాలనీలో సుమారు 20 కుటుంబాలు, 56 మంది జనాభా, 48 మంది ఓటర్లు ఉన్నారని స్థానికులు వెల్లడిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటుకు విలువ ఉంది. ఎన్నికల సమయంలో ప్రతి ఓటరు కీలకమే. కానీ ఎన్నికల తర్వాత అదే ప్రజల కనీస సమస్యలు పరిష్కారం కాకపోతే వారి బాధలు ఎవరు వింటారు.?రోడ్లు, మంచినీరు, వీధిలైట్లు, ఇళ్లు వంటి ప్రాథమిక సౌకర్యాల కోసం కూడా ప్రజలు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడింది? గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఈ కాలనీకి అభివృద్ధి నిధులు కేటాయించారా.? కేటాయిస్తే ఏ పనులు చేపట్టారు.? చేపట్టకపోతే కారణం ఏమిటి.? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

అధికారుల దృష్టికి ప్రత్యేక విజ్ఞప్తి.. కాగితాలపై కాదు, క్షేత్రస్థాయిలో పరిశీలించండి.!

రమణక్కపేట కాలనీ ప్రజల సమస్యలను కేవలం ఫిర్యాదులుగా పరిగణించకుండా మానవీయ కోణంలో చూడాల్సిన అవసరం ఉంది. జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, అశ్వారావుపేట మండల అభివృద్ధి అధికారి, గ్రామపంచాయతీ అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖ, విద్యుత్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, కార్మిక శాఖ, రెవెన్యూ శాఖ, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా కాలనీని సందర్శించాలి.

ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను నమోదు చేయాలి. తాగునీరు, రహదారులు, వీధిలైట్లు వంటి అత్యవసర సదుపాయాలను ప్రాధాన్యతతో కల్పించాలి. అర్హులైన కుటుంబాలకు గృహ పథకాల ప్రయోజనాలు అందించాలి. అటవీ శాఖకు సంబంధించిన వివాదాలపై చట్టబద్ధమైన విచారణ జరిపి కుటుంబాల హక్కులు, అర్హతలను పరిశీలించాలి. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి, కూలీల శ్రమ దోపిడీ ఆరోపణలపై విచారణ చేపట్టాలి.

ఇది కేవలం ఒక కాలనీ సమస్య కాదు.. అభివృద్ధి కోసం ఎదురుచూస్తున్న ఆదివాసీ కుటుంబాల జీవన పోరాటం.! ఒకవైపు ఆధునిక సాంకేతికతతో ప్రపంచం ముందుకు దూసుకుపోతుంటే, మరోవైపు రమణక్కపేట కాలనీ ప్రజలు కనీస రహదారి, తాగునీరు, వీధిలైట్లు, గృహ వసతి కోసం ఎదురుచూడాల్సి రావడం ఆలోచించాల్సిన అంశం.అభివృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తికి చేరినప్పుడే ప్రభుత్వ సంక్షేమానికి నిజమైన అర్థం ఉంటుంది.56 మంది జనాభా ఉన్న ఈ చిన్న కాలనీ సమస్యలను పరిష్కరించడం అధికారులకు అసాధ్యమైన పని కాదు. అవసరమైనది క్షేత్రస్థాయి పరిశీలన, సమన్వయం, చిత్తశుద్ధితో కూడిన చర్యలు.

ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందిస్తారా..? ఐటీడీఏ అధికారులు రమణక్కపేట కాలనీని సందర్శిస్తారా.? ఆదివాసీ కుటుంబాలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పిస్తారా.? అటవీ శాఖ సమస్యకు చట్టబద్ధమైన పరిష్కారం చూపిస్తారా.?అధికారుల స్పందన కోసం రమణక్కపేట కాలనీ ప్రజలు ఎదురుచూస్తున్నారు.



బాల్య వివాహాలు బాలికల భవిష్యత్తుకు శాపం!

- ఉన్నత లక్ష్యాలతో ఎదిగి.. ఆర్థిక స్వావలంబన సాధించాలి

- చదువే బాలికలకు నిజమైన రక్షణ..

- బాల్య వివాహాలపై అవగాహన కల్పించిన షీ టీమ్స్ ఎస్ఐ రమాదేవి



పాల్వంచ, ప్రతినిధి నవంబర్ 27: (విజన్ ఆంధ్ర) బాల్య వివాహాలు బాలికల భవిష్యత్తును అంధకారంలోకి నెడతాయని, చిన్న వయసులో వివాహం చేసుకోవడం వల్ల వారి ఆరోగ్యం, విద్య, జీవితంపై తీవ్ర ప్రభావం పడుతుందని కొత్తగూడెం షీ టీమ్స్ ఎస్ఐ రమాదేవి అన్నారు. బాలికలు ఉన్నత లక్ష్యాలతో ఎదిగి, విద్య ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించాలని ఆమె సూచించారు.అంతర్జాతీయ బాల్య వివాహ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పాల్వంచ కేజీబీవీ జూనియర్ కళాశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) చైర్‌పర్సన్, న్యాయమూర్తి రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా షి టీం ఎస్ఐ రమాదేవి మాట్లాడుతూ.. బాల్య వివాహాల వల్ల బాలికలు అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. చిన్న వయసులోనే వివాహం చేసుకోవడం, గర్భం దాల్చడం వల్ల శారీరక ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా మానసికంగా కూడా ఇబ్బందులు ఎదురవుతాయని వివరించారు. బాలికలు తమ జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే విద్య ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా చదువును మధ్యలో ఆపకూడదని, విద్యే మనిషికి నిజమైన రక్షణగా నిలుస్తుందని సూచించారు. జీవితంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా చదువు ద్వారా పొందిన జ్ఞానం, ఆత్మవిశ్వాసం వాటిని ధైర్యంగా ఎదుర్కొనే శక్తిని అందిస్తాయని అన్నారు. 18 సంవత్సరాలు నిండగానే వివాహం చేసుకోవడమే జీవిత లక్ష్యం కాకూడదని, ముందుగా ఉన్నత విద్యను అభ్యసించి, ఆర్థికంగా స్వతంత్రంగా ఎదిగి, జీవితంపై అవగాహన సాధించిన తర్వాతే వివాహం గురించి ఆలోచించాలని సూచించారు. ఆర్థిక స్వావలంబన సాధించిన బాలికలు కుటుంబంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కోగలరని, తమకు, తమ కుటుంబానికి అవసరమైన సహాయాన్ని అందించగలరని తెలిపారు.బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, బాలికల విద్యకు ప్రాధాన్యతనిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ చైర్‌పర్సన్, న్యాయమూర్తి రాజేందర్, డీఎంహెచ్ఓ తులారాం రాథోడ్, డీడబ్ల్యూఓ తారా, సీడబ్ల్యూసీ సభ్యుడు అంబేద్కర్, ఏఎల్ఓ నాగరాజు, సీఎంఓ ప్రభాకర్, సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న, భరోసా ఎస్ఐ అరుణ, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ రాజేష్, కేజీబీవీ ప్రిన్సిపాల్ తులసి, డీఈఓ శంభు ప్రసాద్, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఏన్కూరు కేజీబీవీలో ఉపాధ్యాయుల మధ్య ఆధిపత్య పోరు!

- విద్యాలయంలో వర్గపోరు.. అధికారుల ముందే పరస్పర ఆరోపణలు

- విచారణ చేపట్టిన జీసీడీఓ రూబీ.. డీఈఓకు నివేదిక సమర్పిస్తానని వెల్లడి



ఏన్కూరు, నవంబర్ 27(విజన్ ఆంధ్ర): ఏన్కూరు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఉపాధ్యాయుల మధ్య నెలకొన్న విభేదాలు చర్చనీయాంశంగా మారాయి. విద్యార్థినులకు విద్యాబుద్ధులు నేర్పి, ఆదర్శంగా నిలవాల్సిన ఉపాధ్యాయులే పరస్పర విభేదాలతో వార్తల్లో నిలుస్తున్నారు. విద్యాలయంలో ఎస్ఓ, పీఈటీల మధ్య కొంతకాలంగా ఆధిపత్య పోరు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ విభేదాలు క్రమంగా తీవ్రరూపం దాల్చి వర్గపోరుకు దారితీసినట్లు సమాచారం. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ విద్యాలయంలో అంతర్గత విభేదాలను బయటపెట్టుకుంటున్నారు. జిల్లా అధికారుల సమక్షంలోనే పరస్పర ఆరోపణలకు దిగడం చర్చకు దారితీసింది. ఉపాధ్యాయుల మధ్య సమన్వయం కొరవడటంతో విద్యాలయ నిర్వహణపై ప్రభావం పడుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థినులకు నాణ్యమైన విద్యాబోధన అందించాల్సిన ఉపాధ్యాయుల మధ్య ఇలాంటి పరిస్థితులు నెలకొనడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో సమస్యను పరిష్కరించేందుకు జిల్లా అధికారులు దృష్టి సారించారు. జిల్లా సంరక్షణ అధికారి (జీసీడీఓ) రూబీ శుక్రవారం కేజీబీవీని సందర్శించి విచారణ చేపట్టారు. విద్యాలయంలో నెలకొన్న పరిస్థితులపై ఉపాధ్యాయులను విడివిడిగా విచారించారు. ఎస్ఓ, పీఈటీల మధ్య తలెత్తిన విభేదాలకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులతోనూ మాట్లాడి వారి అభిప్రాయాలను సేకరించారు. విద్యాలయంలో పనిచేస్తున్న వంట సిబ్బందిని సైతం విచారించి వివరాలు తెలుసుకున్నారు. అన్ని వర్గాల నుంచి సమాచారం సేకరించి సమస్య తీవ్రతను అంచనా వేశారు. ఉపాధ్యాయుల మధ్య సమన్వయ లోపం ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు జీసీడీఓ రూబీ వెల్లడించారు. విచారణలో వెల్లడైన అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. సేకరించిన వివరాలతో సమగ్ర నివేదికను జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)కి సమర్పిస్తానని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల పరిశీలన అనంతరం ఈ వ్యవహారంపై తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

భవిష్యత్తుపై భరోసాతో జీవించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- ప్రతి కుటుంబానికి ప్రభుత్వం భరోసా

- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- సింగరేణి సర్పంచ్ మేదరి టోనీ



కారేపల్లి,నవంబర్ 27(విజన్ ఆంధ్ర) : రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని సింగరేణి గ్రామ సర్పంచ్ మేదరి టోనీ అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సింగరేణి గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సర్పంచ్ మేదరి టోనీ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కుటుంబంలో సంపాదించే వ్యక్తికి అనుకోని ప్రమాదం లేదా మరణం సంభవించినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా బీమా పథకం అండగా నిలుస్తుందన్నారు.ప్రజల సంక్షేమం,భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఇటువంటి పథకాలను అమలు చేయడం అభినందనీయమన్నారు.ప్రతి కుటుంబం భవిష్యత్తుపై భరోసాతో జీవించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామంలోని అర్హులైన కుటుంబాలు ఈ పథకానికి సంబంధించిన వివరాలను తెలుసుకొని,అవసరమైన ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామపంచాయతీ తరఫున కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెద్దమ్మ భాగ్యలక్ష్మి,గ్రామపంచాయతీ కార్యదర్శి నెహ్రూ, వార్డు సభ్యులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకం...

అద్భుతమైన పథకాలను ప్రజలకు అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

ఖబ్జాదారుల నుంచి లింగమూర్తుల వాగును కాపాడండి

- అధికార పార్టీ నేతల అండతోనే లింగమూర్తుల వాగు ఖబ్జా..?

- నామమాత్రపు తనిఖీలు కాకుండా అధికారులు వెంటనే శాశ్వత పరిష్కారం చూపాలి..

- వాగు కబ్జాపై తహశీల్దార్ కు వినతిపత్రం అందజేసిన ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జ్ చెన్నగళ్ల అశోక్

నందిగామ:నవంబర్ 27(విజన్ ఆంధ్ర న్యూస్); లింగమూర్తుల వాగును అధికార పార్టీ నాయకుల అండదండలతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న ఖబ్జాదారుల నుంచి వాగును కాపాడాలని నందిగామ మండల ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ చెన్నగళ్ల అశోక్ నందిగామ మండల తహశీల్దార్ కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జ్ చెన్నగళ్ల అశోక్ మాట్లాడుతూ ప్రకృతి పరంగా వాగులను,చెరువులను అభివృద్ధి చేస్తూ భావితరాలకు ఆదర్శంగా నిలిచేలా అధికార పార్టీ నేతలు ఉండాలన్నారు. కానీ రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం నందిగామ మండల కేంద్రంలో దీనికి విరుద్ధంగా అధికార పార్టీ నేతలు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు పరోక్షంగా అండగా నిలుస్తున్నారని ఆరోపణలు వెలువెత్తుతున్నాయని,అందుకు నిదర్శనం లింగమూర్తుల వాగు అన్నారు.కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూ బకాసురులుగా అవతారమెత్తి రైతులకు,ప్రజలకు అండగా నిలిచిన వాగును వాగు పరిసర ప్రాంత స్థలాలను ఆక్రమించి డబ్బులు దండుకునేందుకు లింగమూర్తుల వాగు ఖబ్జాకు పుణుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అక్రమార్కుల నుండి,భూ బకాసురుల కబ్జా నుండి లింగమూర్తుల వాగును కాపాడేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి,పునరుద్ధరణ చర్యలు చేపట్టి వాగును కాపాడి,రైతులకు ప్రజలకు ఉపయోగడేలా పునరుద్ధరణ చేయాలని కోరారు.లేనిపక్షంలో వాగును రక్షించడానికి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అన్ని ప్రజా సంఘాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి రైతులు మరియు ప్రజలతో కలిసి ఉద్యమం చేయడానికి వెనుకాడబోమని అశోక్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీస్ నందిగామ మండల అధ్యక్షులు శివానంద్,ఎమ్మార్పీస్ నాయకులు జంగారి రమేష్,సతీష్ తదితరులు పాల్గొన్నారు.



పట్టభద్రుల ఓటరు జాబితా పరిశీలనకు ప్రత్యేక ప్రచార దినోత్సవాలు

- ఈ నెల 28, 29 తేదీలతో పాటు డిసెంబర్ 5, 6న నిర్వహణ

- ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు

ఏన్కూరు, నవంబర్ 27(విజన్ ఆంధ్ర): వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి రూపొందించిన డి–నోవో ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు, ఇతర వివరాల పరిశీలనతో పాటు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ కోసం ఏన్కూరు మండలంలో ప్రత్యేక ప్రచార దినోత్సవాలు నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, తహశీల్దార్ సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28, 29 తేదీలతో పాటు డిసెంబర్ 5, 6 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్దేశిత పోలింగ్ కేంద్రాల్లో ఈ కార్యక్రమాలు కొనసాగనున్నాయి. మండలంలోని పోలింగ్ కేంద్రాల పరిధిలోని గ్రామాల వివరాలను అధికారులు వెల్లడించారు. పోలింగ్ కేంద్రం నంబర్ 447 పరిధిలో ఏన్కూరు, నాచారం, మేడపల్లి గ్రామాలు, 448 పరిధిలో టిఎల్ పేట, జన్నారం, నూకలంపాడు గ్రామాలు, 449 పరిధిలో బిఆర్ పురం, కేసుపల్లి, తిమ్మారావుపేట, రాయమాదారం, అరికాయలపాడు గ్రామాలు ఉన్నాయి. అర్హులైన పట్టభద్రులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి ముసాయిదా ఓటరు జాబితాలో తమ పేర్లు, ఇతర వివరాలను సరిచూసుకోవాలని అధికారులు సూచించారు. జాబితాలో పేర్లు లేనివారు, వివరాల్లో తప్పులు ఉన్నవారు నిబంధనల ప్రకారం నిర్ణీత ఫారాల ద్వారా క్లెయిమ్‌లు, అభ్యంతరాలను సమర్పించాలని కోరారు. అర్హులైన పట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అంగన్వాడీ కేంద్రాల్లో ఏం జరుగుతోంది?

- అశ్వారావుపేట సెక్టార్‌లో మూడు గంటలకే మూతపడుతున్న కేంద్రాలు.!

- కన్యకాపరమేశ్వరి వీధి, చింతలబజార్ అంగన్వాడీలు మూసివేసి గడియపెట్టి వెళ్లిపోతున్న వైనం.!

- రమణక్కపేట కేంద్రంలో పదిమంది పిల్లలకు హాజరు.. బియ్యం లెక్కల్లో అంతుచిక్కని వ్యవహారం.!



విజన్ ఆంధ్రా (నవంబర్ 28)భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గ ప్రతినిధి //అశ్వారావుపేట: చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి.. గర్భిణులు, బాలింతల ఆరోగ్యాన్ని పరిరక్షించాలి.. పేద కుటుంబాల పిల్లలకు విద్యతో పాటు పోషకాహార భద్రత కల్పించాలి. ఇదీ అంగన్వాడీ కేంద్రాల ప్రధాన లక్ష్యం. కానీ అశ్వారావుపేట సెక్టార్ పరిధిలోని కొన్ని అంగన్వాడీ కేంద్రాల్లో కనిపిస్తున్న పరిస్థితులు ఈ లక్ష్యానికే విరుద్ధంగా ఉన్నాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ నిధులతో అందిస్తున్న ఆహార సరుకులు నిజంగా చిన్నారులకు చేరుతున్నాయా.? లేక రిజిస్టర్లలో లెక్కలు చూపించి విధులు ముగిస్తున్నారా.? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

మూడు గంటలకే అంగన్వాడీలకు ముగింపు.!

అశ్వారావుపేట సెక్టార్ పరిధిలోని కన్యకాపరమేశ్వరి వీధి అంగన్వాడీ కేంద్రం, చింతలబజార్ అంగన్వాడీ కేంద్రాలు మధ్యాహ్నం మూడు గంటలకే మూసివేసి గడియపెట్టి వెళ్లిపోతున్న పరిస్థితి కనిపిస్తోంది. చిన్నారుల సంరక్షణ, ప్రాథమిక విద్య, పౌష్టికాహారం అందించాల్సిన కేంద్రాలను నిర్ణీత పని వేళల కంటే ముందుగానే మూసివేయడం వెనుక కారణాలేమిటి.? సిబ్బంది విధులను పూర్తిస్థాయిలో నిర్వహిస్తున్నారా.? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అంగన్వాడీ కేంద్రాలు తెరిచి ఉన్నాయా లేదా అన్నది మాత్రమే కాదు.. పిల్లలకు ప్రతిరోజూ అందాల్సిన సేవలు వాస్తవంగా అందుతున్నాయా లేదా అన్నదే అసలు ప్రశ్న. కేంద్రాల పని వేళలు, సిబ్బంది హాజరు, పిల్లలకు అందుతున్న సేవలపై ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సిన అవసరం ఉంది.

రమణక్కపేట అంగన్వాడీలో హాజరు లెక్కల మతలబు.!

ఇక రమణక్కపేట అంగన్వాడీ కేంద్రానికి సంబంధించిన హాజరు రిజిస్టర్, ఆహార వినియోగ వివరాలు మరిన్ని ప్రశ్నలకు తావిస్తున్నాయి. అందుబాటులో ఉన్న రికార్డుల ప్రకారం ఒకరోజు మొత్తం పది మంది పిల్లలకు హాజరు నమోదు చేసి, అదే రోజు బియ్యం వండినట్లు లెక్కలు చూపించినట్లు తెలుస్తోంది. అయితే అంగన్వాడీ టీచర్ చెబుతున్న వివరాలు మరోలా ఉన్నాయి. మొత్తం పది మందిలో నలుగురికి టేక్ హోమ్ రేషన్ అందించామని, మరో ఇద్దరు పిల్లలు ఇంటికి వెళ్లిపోయారని, మిగిలిన నలుగురు పిల్లలు మాత్రమే కేంద్రంలో ఉన్నారని టీచర్ వివరిస్తున్నారు. ఇక్కడే అసలు లెక్కలపై సందేహాలు మొదలవుతున్నాయి. రిజిస్టర్లో పదిమందికి హాజరు.. నలుగురికి టేక్ హోమ్ రేషన్.. ఇద్దరు ఇంటికి వెళ్లిపోవడం.. చివరకు నలుగురు మాత్రమే కేంద్రంలో ఉండటం.. మరి ఆ రోజు వండిన ఆహారం, వినియోగించిన బియ్యం లెక్కలు ఎలా నిర్వహించారు.? ఉదయం పది గంటలకే మధ్యాహ్న భోజనం తయారు చేసి పిల్లలకు పెట్టి వాళ్ళను ఇంటికి పంపించివేస్తున్నారా. రిజిస్టర్లో నమోదైన హాజరు, వాస్తవంగా భోజనం చేసిన పిల్లల సంఖ్య, టేక్ హోమ్ రేషన్ పంపిణీ వివరాలు ఒకదానితో మరొకటి సరిపోతున్నాయా లేదా అన్నది అధికారులు తేల్చాల్సి ఉంది.

900 గ్రాముల బియ్యం.. లెక్కల్లో అసలు కథేమిటి?

అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం ఆ రోజు మొత్తం 900 గ్రాముల బియ్యం వండినట్లు లెక్క చూపిస్తున్నారు.

లెక్కను పరిశీలిస్తే..పది మంది పిల్లలకు ఒక్కొక్కరికి 75 గ్రాముల చొప్పున = 750 గ్రాములు.

ఒక బాలింతకు 150 గ్రాములు. మొత్తం బియ్యం = 900 గ్రాములు.అయితే నలుగురికి టేక్ హోమ్ రేషన్ ఇచ్చినట్లు చెబుతున్నప్పుడు, మరో ఇద్దరు పిల్లలు ఇంటికి వెళ్లిపోయినప్పుడు, కేంద్రంలో నలుగురు మాత్రమే ఉన్నప్పుడు ఈ 900 గ్రాముల బియ్యం వినియోగం ఎలా జరిగింది.?ఇది కేవలం ఒకరోజు లెక్క మాత్రమేనా. లేక ప్రతిరోజూ ఇదే విధంగా హాజరు, ఆహార వినియోగ వివరాలు నమోదు చేస్తున్నారా. అన్నది విచారణలో తేలాల్సి ఉంది.

మూడేళ్ల పిల్లలకు బియ్యం కేటాయించడం ఉండదట.. మరి రిజిస్టర్లలో కేటాయించినట్లు హాజరు ఎందుకు.ఈ వ్యవహారంపై సూపర్‌వైజర్ వివరణ మరో కొత్త ప్రశ్నను ముందుకు తెచ్చింది. మూడేళ్ల పిల్లలకు బియ్యం కౌంట్ ఉండదని సూపర్‌వైజర్ చెబుతున్నట్లు సమాచారం.ఒకవేళ మూడేళ్ల పిల్లలకు బియ్యం కేటాయింపు వర్తించదని నిబంధనలు చెబుతున్నట్లయితే, మరి వారి పేర్లపై కేటాయించాబడిన హాజరు ఎలా నమోదు చేస్తున్నారు.? ఆ పిల్లలకు సంబంధించి ఆహార సరఫరా, వినియోగ లెక్కలు ఎలా నిర్వహిస్తున్నారు.?

బియ్యం కౌంట్ లేదని చెబుతున్నప్పుడు గతంలో ఎన్ని రోజుల నుంచి రిజిస్టర్లలో హాజరు నమోదు అవుతోంది. ఆ కాలానికి సంబంధించిన బియ్యం నిల్వలు, సరఫరా, వినియోగ వివరాలు ఏమిటి.అసలు బియ్యం కౌంట్ లేకపోతే రిజిస్టర్లలో చూపిస్తున్న లెక్కల వెనుక ఉన్న విధానం ఏమిటో సూపర్‌వైజర్, సీడీపీవో అధికారులు స్పష్టం చేయాలి.

బియ్యం లెక్కలు సరే.. పప్పు, నూనె సంగతేంటి.?

అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అంటే కేవలం అన్నం మాత్రమే కాదు. పిల్లలకు అందించే భోజనంలో పప్పు, నూనె, ఇతర అవసరమైన ఆహార పదార్థాలు కూడా కీలకమైనవి.900 గ్రాముల బియ్యం వండినట్లు లెక్కలు చూపిస్తున్నప్పుడు దానికి అనుగుణంగా పప్పు ఎంత వినియోగించారు.? నూనె ఎంత ఉపయోగించారు.? ఇతర ఆహార పదార్థాలు ఎంత పరిమాణంలో ఉపయోగించారు.?రోజువారీగా కేంద్రానికి వస్తున్న సరుకులు ఎంత.? రిజిస్టర్లలో చూపిస్తున్న వినియోగం ఎంత.? వాస్తవంగా పిల్లలకు అందుతున్న పరిమాణం ఎంత.?టేక్ హోమ్ రేషన్ పేరుతో సరుకులు పంపిణీ చేస్తున్నప్పుడు వాటి వివరాలు ప్రత్యేకంగా నమోదు చేస్తున్నారా.? పంపిణీ తీసుకున్న వారి సంతకాలు, వేలిముద్రలు ఉన్నాయా.?ఈ వివరాలన్నింటినీ తనిఖీ చేస్తేనే ఆహార సరుకుల వినియోగంలో పారదర్శకత ఉందో లేదో స్పష్టమవుతుంది.

ఒక్కరోజు కాదు.. గత రికార్డులన్నీ పరిశీలించాలి!

రమణక్కపేట అంగన్వాడీ కేంద్రంలో వెలుగులోకి వచ్చిన ఈ అంశాలను ఒక్కరోజు వ్యవహారంగా పరిగణించి వదిలేయకూడదు. గత నెలల హాజరు రిజిస్టర్లు, బియ్యం వినియోగ రికార్డులు, పప్పు, నూనె స్టాక్ వివరాలు, టి.హెచ్.ఆర్ పంపిణీ రికార్డులను సమగ్రంగా పరిశీలించాలి.ముఖ్యంగా గత మూడు నెలల్లో రోజువారీగా ఎంతమంది పిల్లలకు హాజరు వేశారు.? వాస్తవంగా ఎంతమంది పిల్లలు కేంద్రానికి వచ్చారు.? ఎంతమందికి భోజనం అందించారు.? ఎంతమందికి టి.హెచ్.ఆర్ పంపిణీ చేశారు.? రోజువారీగా ఎంత బియ్యం, పప్పు, నూనె వినియోగించారు.? సరుకుల స్టాక్ రిజిస్టర్, వినియోగ రిజిస్టర్ మధ్య తేడాలు ఉన్నాయా.? అనే అంశాలపై విచారణ జరగాలి.

అధికారుల పర్యవేక్షణ ఎక్కడ.?

అంగన్వాడీ కేంద్రాల నిర్వహణపై పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత సూపర్‌వైజర్, సీడీపీవోతో పాటు సంబంధిత ఐసీడీఎస్ అధికారులపై ఉంటుంది. కేంద్రాల్లో పిల్లల హాజరు, ఆహార నాణ్యత, సరుకుల నిల్వలు, పంపిణీ వివరాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి.కానీ కేంద్రాలు ముందుగానే మూసివేస్తున్నాయనే అంశాలు, రిజిస్టర్లలో హాజరు మరియు వాస్తవ పరిస్థితుల మధ్య తలెత్తుతున్న ప్రశ్నలు వెలుగులోకి వస్తున్నప్పుడు పర్యవేక్షణ వ్యవస్థ పనితీరుపై కూడా సమాధానాలు రావాల్సిందే.

ఐసీడీఎస్ ఉన్నతాధికారులకు సూటి ప్రశ్నలు.!

అశ్వారావుపేట సెక్టార్ పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి.ముఖ్యంగా కన్యకాపరమేశ్వరి వీధి, చింతలబజార్, రమణక్కపేట కేంద్రాల పనివేళలు, పిల్లల హాజరు, ఆహార పంపిణీపై ప్రత్యేక విచారణ చేపట్టాలి.రమణక్కపేట కేంద్రానికి సంబంధించిన హాజరు రిజిస్టర్, బియ్యం వినియోగ రికార్డులు, టి.హెచ్.ఆర్ పంపిణీ వివరాలను పోల్చి చూడాలి. గత మూడు నెలల సరుకుల సరఫరా, వినియోగం, నిల్వలపై తనిఖీ నిర్వహించాలి. రికార్డుల్లో తేడాలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి.



ఆరోగ్య ఉప కేంద్రానికి వైద్య పరికరాలు బహూకరణ

- మాజీ పోలీస్ ఏఎస్పీ దొడ్డపిన్ని వేంకట నర్సయ్య ఉదారత



ఏన్మూరు, నవంబర్ 27(విజన్ ఆంధ్ర): మండల పరిధిలోని తూతక లింగన్నపేట గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రానికి అదే గ్రామానికి చెందిన మాజీ పోలీస్ ఏఎస్పీ దొడ్డపిన్ని వేంకట నర్సయ్య వైద్య పరికరాలను బహూకరించారు. ఆరోగ్య ఉపకేంద్రంలో కొన్ని వైద్య పరికరాల కొరత ఉందని ఏఎస్పీ మిత్రుడు కొవ్వూరు నాగేశ్వరరావు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన వేంకట నర్సయ్య అవసరమైన పరికరాలను అందించేందుకు ముందుకొచ్చారు. ఈ క్రమంలో వేయింగ్ మిషన్, స్టెతస్కోప్, థర్మామీటర్, కుర్చీలను శుక్రవారం గ్రామ సర్పంచ్ గూగులోత్ ప్రవీణ్ చేతుల మీదుగా ఆరోగ్య ఉపకేంద్రానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నామా వెంకయ్య, గ్రామస్తులు కట్టా ఖాదర్ బాబు, జజ్జూరు కృష్ణమాచారి, సీహెచ్ఓ వెంకటేశ్వర్లు, స్థానిక ఏఎన్ఎం నీలావతి, సిబ్బంది గోపీ, కృష్ణ, అరుణకుమారి, ఆశా కార్యకర్తలు లక్ష్మి, కృష్ణవేణి, శారద తదితరులు పాల్గొన్నారు.

తిమ్మంపేట పంచాయతీలో 5 లక్షల జీవిత బీమా కార్యక్రమంలో పాల్గొన్న సోయం నాగరాజు



విజన్ ఆంధ్రా న్యూస్ నవంబర్ 26 ములకలపల్లి మండలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం లోని ములకలపల్లి మండలంలోని తిమ్మంపేట గ్రామ పంచాయతీలో నిర్వహించిన ఐదు లక్షల రూపాయల జీవిత బీమా కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సోయం నాగరాజు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు జీవిత బీమా ప్రాధాన్యత, కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడంలో బీమా పథకాల ఉపయోగాల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ జీవిత బీమా పట్ల అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రజల సంక్షేమమే లక్ష్యంగా, ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే ధ్యేయంగ అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పలు కార్యక్రమాలు అమలు చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మంత్రివర్యులకు, అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ జారే ఆదినారాయణ తిమ్మంపేట గ్రామ ప్రజల తరపున ధన్యవాదములు తెలుపుతున్నాము. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తిమ్మంపేట పంచాయతీ కార్యదర్శి రజిత రాయల చంద్రం, నూప రాజు, సోయం సాయి, కొండ్రు హరి, పాస్టర్ మోసయ్య, నాగచైతన్య, గ్రామస్థులు ,తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కారేపల్లి క్రాస్ రోడ్డులో ఐమాస్ట్ లైటింగ్ను ప్రారంభించిన సర్పంచ్



కారేపల్లి,నవంబర్ 27 (విజన్ ఆంధ్ర) : మండల పరిధిలోనే కారేపల్లి క్రాస్ రోడ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఐమాస్ట్ లైటింగ్ను శుక్రవారం విశ్వనాథపల్లి గ్రామ సర్పంచ్ ఇస్లావత్ రాజు ప్రారంభించారు. ఒక లక్ష 30 వేల రూపాయల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఐమాస్టు లైటింగ్ను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ త్వరలోనే గ్రామపంచాయతీ పరిధిలో ఇలాంటి లైటింగ్ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ధనమ్మ వార్డు సభ్యులు రోజా, హారిక గ్రామస్తులు పుచ్చకాయల శ్రీనివాసరావు, ఉప్పు వెంకన్న, సురభి కొండలు, దమ్ములపాటి రాంబాబు, సూరపరెడ్డి తిరుపతిరెడ్డి, సురపు రెడ్డి కమలాకర్ రెడ్డి, సిద్ధం శెట్టి నాగయ్య, బట్టు శ్రీనివాస్, గూగులో తు బిక్షం తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల ఓట్లు కావాలి.. సంక్షేమం మాత్రం వద్దా?

- హామీల హోరు.. అమలులో జీరో!

- ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన, రేవంతన్నా కా సహారా పథకాలు ఎక్కడ?

- 12 శాతం రిజర్వేషన్ల హామీని గాలికొదిలేశారా?

- మైనారిటీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్న పాలకులు

- ఏఎండీఆర్ ఫౌండేషన్ ఫౌండర్ ఆదిల్ ఘాటు విమర్శలు



కొత్తగూడెం బ్యూరో, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర) ఎన్నికలొస్తే ముస్లిం మైనారిటీలు గుర్తుకొస్తారు.. ఓట్లు కావాలంటే సంక్షేమ హామీల వరద పారిస్తారు.. అధికార పీఠం దక్కగానే ఆ హామీలన్నీ అటకెక్కుతాయా? ఇదేనా మైనారిటీల పట్ల పాలకుల చిత్తశుద్ధి? సభల్లో గొప్ప ప్రకటనలు.. ప్రచారంలో ఆకర్షణీయమైన పథకాల పేర్లు.. కానీ పేద మైనారిటీ కుటుంబాల గడపకు మాత్రం సంక్షేమ ఫలాలు చేరడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన', 'రేవంతన్నా కా సహారా' వంటి పథకాల ప్రకటనలతో ఆశలు కల్పించి, అమలు విషయంలో మాత్రం స్పష్టత ఇవ్వకపోవడం మైనారిటీ వర్గాల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతోంది. ముస్లింల ఓట్లు కావాలి కానీ వారి బతుకులు మారాలనే ఆలోచన లేదా? అంటూ ఏఎండిఆర్ ఫౌండేషన్ ఫౌండర్ ఆదిల్ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నిస్తున్నారు.

ఏడు దశాబ్దాలు గడిచినా మారని బతుకులు!

భారతదేశం స్వాతంత్ర్యం సాధించి ఏడు దశాబ్దాలకు పైగా గడిచింది. దేశం సాంకేతిక, పారిశ్రామిక, ఆర్థిక రంగాల్లో ఎన్నో మైలురాళ్లు అధిగమించింది. కానీ ముస్లిం మైనారిటీ సమాజంలోని పేద కుటుంబాల పరిస్థితిలో ఆశించిన మార్పు ఎందుకు రావడం లేదు? విద్య, ఉద్యోగం, ఉపాధి, ఆర్థిక అభివృద్ధి, రాజకీయ ప్రాతినిధ్యం వంటి రంగాల్లో ఇంకా వెనుకబాటుతనం ఎందుకు కొనసాగుతోంది? రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించినా, ఆ హక్కుల ఫలాలు అట్టడుగు మైనారిటీ కుటుంబాలకు ఎంతవరకు అందుతున్నాయన్నది పాలకులు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అంశం.

కమిషన్ల నివేదికలు బుట్టదాఖలా.. హామీలు మాత్రం కోకొల్లలు!

ముస్లిం సమాజం ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన వెనుకబాటుతనాన్ని సచార్ కమిటీతో పాటు పలు అధ్యయనాలు ఇప్పటికే వెల్లడించాయి. సమస్యల పరిష్కారానికి అనేక సిఫార్సులు చేసినా, వాటి అమలులో ప్రభుత్వాలు ఎందుకు వెనుకబడుతున్నాయి? నివేదికలు తయారుచేయడానికి, సమావేశాలు నిర్వహించడానికి, హామీలు గుప్పించడానికి ఉన్న ఉత్సాహం సమస్యల పరిష్కారానికి ఎందుకు కనిపించడం లేదు? మైనారిటీల అభివృద్ధి కోసం రూపొందించిన పథకాలు కాగితాలకే పరిమితమైతే వాటి వల్ల పేదలకు ఒరిగేదేమిటి? సంక్షేమం పేరుతో ప్రచార ఆర్భాటం చేయడం తప్ప ఆచరణలో మార్పు తీసుకురాకపోతే ఆ ప్రకటనలకు అర్థం ఏమిటి?

ఇందిరమ్మ పథకం ఎక్కడ? రేవంతన్నా సహారా ఎవరికీ?

మైనారిటీ మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పిస్తామని ప్రకటించిన 'ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన', నిరుపేదలకు అండగా నిలుస్తామన్న 'రేవంతన్నా కా సహారా' పథకాల అమలుపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలి. ఈ పథకాల ద్వారా ఎంతమందికి లబ్ధి చేకూరింది? అర్హులైన వారికి ఎప్పటిలోగా ఆర్థిక సహాయం అందిస్తారు? బడ్జెట్‌లో ఎంత నిధులు కేటాయించారు? లబ్ధిదారుల ఎంపికకు ఎలాంటి మార్గదర్శకాలు రూపొందించారు? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఎందుకు లేవు? పథకాల పేర్లతో మైనారిటీల్లో ఆశలు రేకెత్తించి, ఆచరణలో నిరాశ మిగిల్చడం ఎంతవరకు సమంజసం? మహిళా సాధికారత మాటల్లో కాదు.. ఆర్థిక సహాయం, ఉపాధి అవకాశాలు, స్వయం ఉపాధి రుణాల రూపంలో కనిపించాలి.

12 శాతం రిజర్వేషన్లు.. రాజకీయ హామీలకే పరిమితమా?

ముస్లిం మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీ ఏళ్ల తరబడి రాజకీయ వేదికలపై వినిపిస్తూనే ఉంది. పాలకులు మారినా మైనారిటీల ఆశలు మాత్రం మారడం లేదు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చలేకపోయింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ అంశంపై తన స్పష్టమైన వైఖరిని ప్రజల ముందు ఉంచాల్సిన బాధ్యత నుంచి తప్పించుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. న్యాయపరమైన పరిమితులు ఉంటే వాటిని వివరించాలి. సాధ్యమైన ప్రత్యామ్నాయాలపై కార్యాచరణ ప్రకటించాలి. అంతేకానీ ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి, తర్వాత మౌనం పాటించడం మైనారిటీలను మభ్యపెట్టడమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మైనారిటీ బడ్జెట్ ఏది? సబ్‌ప్లాన్ ఎందుకు లేదు?

మైనారిటీల అభివృద్ధికి ప్రత్యేక సమగ్ర బడ్జెట్, సబ్‌ప్లాన్ అమలు చేయాల్సిన అవసరం ఉంది. విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఉన్నత విద్యకు ప్రోత్సాహం, నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధికి రుణాలు, మహిళలకు ఆర్థిక చేయూత అందించాలి. మైనారిటీ కార్పొరేషన్‌ను బలోపేతం చేయాలి. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకోవాలి. ఉర్దూ భాషకు రెండో అధికార భాష హోదా కల్పించిన రాష్ట్రంలో దాని అమలు పరిస్థితి ఏమిటో ప్రభుత్వం సమీక్షించాలి. కేటాయించిన నిధులు పూర్తిస్థాయిలో ఖర్చవుతున్నాయా? లబ్ధిదారులకు చేరుతున్నాయా? అనే అంశాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి.

ఓట్లు అడిగే ముందు అభివృద్ధి లెక్కలు చెప్పండి!

ఎన్నికల సమయంలో మైనారిటీల ఇళ్లకు వెళ్లి ఓట్లు అడిగే నాయకులు, అధికారంలోకి వచ్చిన తర్వాత అదే కుటుంబాల సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదన్న ప్రశ్నకు సమాధానం చెప్పాలి. ముస్లింలను కేవలం ఓటు బ్యాంకుగా పరిగణిస్తూ తాత్కాలిక హామీలతో సంతృప్తిపరచే రాజకీయాలకు ఇకనైనా స్వస్తి పలకాలి. దేశాభివృద్ధిలో ముస్లిం సమాజానికి సముచిత భాగస్వామ్యం కల్పించాలి. విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో రాజ్యాంగబద్ధమైన సమాన అవకాశాలు కల్పించాలి. మైనారిటీల హక్కులు ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడినవి కావు.. అవి రాజ్యాంగం ప్రసాదించిన హక్కులు.

ఆదిల్ ఘాటు ప్రశ్నలు.. రేవంత్ ప్రభుత్వానికి సూటి సవాల్!

ఏఎండీఆర్ ఫౌండేషన్ ఫౌండర్ ఆదిల్ మైనారిటీల సంక్షేమంపై ప్రభుత్వాల తీరును తీవ్రంగా ప్రశ్నిస్తున్నారు. ముస్లిం మైనారిటీల ఓట్లు కావాలి కానీ వారి అభివృద్ధి మాత్రం పట్టదా? ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు అధికారంలోకి వచ్చిన తర్వాత విలువ లేదా? ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన, రేవంతన్నా కా సహారా పథకాలు ఎప్పటి నుంచి పూర్తిస్థాయిలో అమలవుతాయి? 12 శాతం రిజర్వేషన్ల హామీపై పాలకుల చిత్తశుద్ధి ఏమిటి? అని ఆయన నిలదీస్తున్నారు. మైనారిటీలను ఓటు బ్యాంకుగా చూసే రాజకీయాలకు ముగింపు పలకాలని, ప్రకటనలతో కాలయాపన చేయకుండా కార్యాచరణతో ముందుకు రావాలని ఆదిల్ డిమాండ్ చేస్తున్నారు. ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, సంక్షేమ పథకాల అమలుకు కాలపరిమితి నిర్ణయించి, ప్రతి అర్హుడికి ప్రయోజనం అందించాలని కోరుతున్నారు.

కల్లూరు రెవెన్యూ కార్యాలయం అధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించిన సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్



కల్లూరు,నవంబర్27(విజన్ ఆంధ్ర) తహసీల్దార్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఐఏఎస్ వివిధ రెవెన్యూ అంశాలపై అధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ప్రధానంగా క్రింది అంశాలపై విస్తృతంగా సమీక్ష నిర్వహించారు.భూ భారతి లో 60 రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల స్థితిగతులు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు.రీసర్వే,సాదాబైనామా, భూ భారతి సంబంధిత దరఖాస్తుల ప్రస్తుత పురోగతి.మీ సేవ, కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ దరఖాస్తుల ప్రస్తుత స్థితిగతులు.ఆహార భద్రత కార్డుల జారీకి సంబంధించిన దరఖాస్తుల పురోగతి.ప్రజావాణి,ఇతర మార్గాల ద్వారా అందిన ఫిర్యాదులు, వినతుల పరిష్కార స్థితిగతులు. గత 14 రోజులలో రిజిస్ట్రేషన్ స్లాట్ల పెండింగ్, రద్దులు మరియు వాటికి గల కారణాలు.గత 14 రోజులలో తహసీల్దార్ల లాగిన్ సమయాలు, విధుల నిర్వహణలో సమయపాలన.భూసేకరణ, భూ పరాయీకరణ సంబంధిత అంశాల పైన వివరాలు తెలుసుకున్నారు .ఈ కార్యక్రమం లో తాసిల్దార్ కార్యాలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అండర్-14 ఖో ఖో టోర్నమెంట్,ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టుకు ఎంపికైన తల్లాడ యూనివర్సల్ విద్యార్థి



తల్లాడ నవంబర్ 27: విజన్ ఆంధ్ర : కల్లూరు పీఎం శ్రీ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి అండర్--14 బాలుర ఖో ఖో టోర్నమెంట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన తల్లాడ యూనివర్సల్ విద్యాలయం విద్యార్థి జి. సాయి గణేష్ రెడ్డి ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. యూనివర్సల్ విద్యాలయంలో ఎనిమిదో తరగతి చదువుతున్న సాయి గణేష్ రెడ్డి ఖో ఖో పోటీల్లో ప్రతిభను చాటుతూ జిల్లా స్థాయి నుంచి ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక కావడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ టి.కె. ప్రసన్నన్, డైరెక్టర్ సోఫియా, పీఈటీ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

చదువుతో సరిహద్దులు చెరిపేసిన గిరిజన బిడ్డ

- ఉస్మానియా యూనివర్సిటీలో సీటు సాధించిన కుంజ శాలిని



గుండాల, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర) ఏజెన్సీ మారుమూల ప్రాంతానికి చెందిన గిరిజన విద్యార్థిని కుంజా శాలిని ఉన్నత విద్యలో సత్తా చాటింది. గుండాల మండలం దామరతోగు గ్రామానికి చెందిన శాలిని హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో ఎం.కాం. పీజీ కోర్సులో సీటు సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచింది.అంగన్‌వాడీ కేంద్రం నుంచి తన విద్యాభ్యాసాన్ని ప్రారంభించిన శాలిని, ఎల్‌కేజీ నుంచి ప్రాథమిక విద్య వరకు చదువుతూ నవోదయ, గురుకుల పాఠశాలల్లో సీట్లు సాధించింది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, తన పట్టుదలతో డిగ్రీ వరకు విద్యను కొనసాగించి, తాజాగా ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ చదివే అవకాశం దక్కించుకుంది.శాలిని తల్లిదండ్రులు కుంజా నాగేశ్వరరావు, లలిత తమ కుమార్తె విజయంపై ఆనందం వ్యక్తం చేశారు.మారుమూల ప్రాంత విద్యార్థులు కూడా పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను చేరుకోగలరని శాలిని విజయం నిరూపిస్తోంది. ఆమె సాధించిన ఘనత పలువురికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

దైవాలగూడ అభివృద్ధికి కట్టుబడి ఉన్న

- సర్పంచ్ పాలమాకుల మల్లయ్య



షాబాద్, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర) దైవాల గూడ గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని సర్పంచ్ పాలమాకుల మల్లయ్య అన్నారు. శుక్రవారం దైవాలగూడ గ్రామంలో సిసి రోడ్లు, అండర్ డ్రైనేజ్ పనులు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు .గ్రామంలో విద్యుత్ లైట్లు సిసి రోడ్లు అండర్ డ్రైనేజ్ పనులకు మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రపోజల్ పంపినట్లు పేర్కొన్నారు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు రాగానే పనులు ప్రారంభిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సర్పంచ్ బుగ్గరాములు వార్డ్ మెంబర్లు యాదమ్మ, నాయకులు శ్రీకాంత్, కడమంచి జంగయ్య, శ్రీనివాస్, వికాస్, యాదయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు

హలో ఆదివాసీ.. ఛలో హైదరాబాద్

- డిసెంబర్ 9 ఆదివాసీ జన గర్జన మహాసభను జయప్రదం చేయండి

- గుండాల మండలంలో విస్తృత ప్రచారం గ్రామాల్లో కరపత్రాల ఆవిష్కరణ



గుండాల, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర) ఆదివాసీ హక్కుల సాధన కోసం డిసెంబర్ 9న హైదరాబాద్‌లో నిర్వహించనున్న "ఛలో హైదరాబాద్ -- ఆదివాసీ జన గర్జన" భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) నాయకులు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆదివాసీ ప్రజానీకం అధిక సంఖ్యలో సభకు తరలివచ్చి తమ హక్కుల కోసం గళమెత్తాలని కోరారు.ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో డిసెంబర్ 9, 2026న రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఈ మహాసభ నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, రాజ్యాంగ పరిరక్షణ ప్రధాన లక్ష్యంగా ఈ సభ కొనసాగుతుందని పేర్కొన్నారు.ఈ సభకు ఆదివాసీ ప్రజలను సమీకరించేందుకు గుండాల మండలంలోని కాచనపల్లి, ముత్తపురం, పడగొనిగూడెం, శెట్టుపల్లి, శంబునిగూడెం, సాయనపల్లి, దేవలగూడెం, లింగగూడెం గ్రామాల్లో నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో కరపత్రాలను ఆవిష్కరించి, సభ ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా తుడుం దెబ్బ జాతీయ నాయకుడు కోడెం వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి ముక్తి రాజు మాట్లాడుతూ జల్, జంగల్, జమీన్ (నీరు, అడవి, భూమి)పై ఆదివాసీలకు ఉన్న హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఐదో షెడ్యూల్ సమర్థవంతంగా అమలు చేయాలని, ఎస్టీ రిజర్వేషన్లను పరిరక్షించాలని, ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను అమలు చేయాలని ఈ మహాసభ ద్వారా ప్రభుత్వాలకు స్పష్టమైన సందేశం ఇవ్వనున్నట్లు తెలిపారు.ఆదివాసీల జీవన విధానం, సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుకుంటూ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని నాయకులు పేర్కొన్నారు. ఆదివాసీల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు ప్రతి గ్రామం నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో సభకు తరలిరావాలని కోరారు.లక్ష విల్లంబులతో, అంబలి బుర్రలతో, ఆకుపచ్చ జెండాలతో" ఆదివాసీలు తమ సంప్రదాయ పద్ధతిలో హైదరాబాద్‌కు తరలివచ్చి ఆదివాసీ జన గర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంజా వసంతరావు, జిల్లా నాయకుడు పులసం వీరభద్రం, ఇల్లెందు మండల అధ్యక్షుడు గుమ్మడి రామ్ కుమార్, ఆదివాసీ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ ఊకె రామకృష్ణ, సుతారీ సత్యనారాయణ, గుండాల మండల ప్రధాన కార్యదర్శి, చేబోతు రంజిత్ కుమార్, గుండాల మండల అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవం

--వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజా బాల్ రెడ్డి



తాండూరు నవంబర్ 27 (విజన్ ఆంధ్ర) శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజా బాల్ రెడ్డి పాల్గొని అయ్యప్ప స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకొని అయ్యప్ప స్వామి ఆలయం నుండి పట్టణంలోని పూరవీధుల గుండా స్వామివారి ఊరేగింపు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా కొనసాగింది. ఈ ఊరేగింపు కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు భారీగా పాల్గొని స్వామివారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది ఈ వేడుకల్లో అయ్యప్ప స్వామి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ నీరజా బాల్ రెడ్డి మాట్లాడుతూ అయ్యప్ప స్వామి ఆశీస్సులతో, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని ప్రార్థించారు.భక్తుల స్వామి నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగగా, వార్షికోత్సవ వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో కన్నులపండువగా సాగాయి.

తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఇందిరమ్మ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- తాండూరు మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్‌రెడ్డి



తాండూరు నవంబర్ 27 (విజన్ ఆంధ్ర): రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తాండూరు మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్‌రెడ్డి కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో 6వ వార్డుకు సంబంధించి ఇందిరమ్మ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియను మున్సిపల్ చైర్పర్సన్ నీరజ బాల్‌రెడ్డి కమిషనర్ రాకేష్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఇందిరమ్మ 5 లక్షల జీవిత బీమా పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ పెద్దను కోల్పోతే ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలని సహృదయంతో ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రవేశం పెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రాకేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బాతుల నాగు, మాజీ కౌన్సిలర్ బోయ రవి, తదితరులు ఉన్నారు.

మిర్చి రైతులపై తెగుళ్ల పంజా పాలకులది పట్టించుకోని వైఖరి

- పంట నాశనం..అప్పులు భారంగా.. రైతుల కన్నీళ్లు తుడిచేదెవరు

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు ఆగ్రహం

- మిర్చి రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలి



బోనకల్ నవంబర్ 27 విజన్ ఆంధ్ర.తూటికుంట్ల గ్రామంలో మిర్చి సాగు చేసిన రైతులకు ఏరుకుళ్ల తెగులు తీవ్ర నష్టాన్ని కలిగించడంతో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు శుక్రవారం జిల్లా నాయకులతో కలిసి బాధిత రైతుల పొలాలను సందర్శించి పంట పరిస్థితిని పరిశీలించారు గ్రామంలో సుమారు 150 మంది రైతులు 550 ఎకరాల్లో మిర్చి సాగు చేయగా పంట కోతకు సిద్ధమయ్యే సమయంలో తెగులు సోకడంతో ఆశించిన దిగుబడి రాకుండా పోయిందని తెలిపారు ఎకరాకు లక్షన్నర వరకు ఖర్చు చేసిన రైతులకు కనీస దిగుబడి కూడా దక్కే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు గతంలో పత్తి సాగుతో నష్టపోయిన రైతులు మిర్చి పంటపై ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ తెగుళ్ల కారణంగా మరోసారి తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వచ్చిందన్నారు కౌలు రైతు సాదినేని ప్రసాద్ 13 ఎకరాల్లో మిర్చి సాగు కోసం సుమారు రూ.30 లక్షలు అప్పు చేసి పెట్టుబడి పెట్టగా పంట పూర్తిగా దెబ్బతినడంతో అప్పులు తీర్చలేని దుస్థితి ఏర్పడిందని వివరించారు రైతుల కష్టాలను పట్టించుకోవాల్సిన ప్రభుత్వాలు నష్టాలపై స్పందించకపోవడం దారుణమని మండిపడ్డారు జిల్లాలో మంత్రులు ఉన్నా రైతుల సమస్యలకు పరిష్కారం చూపేవారు కరువయ్యారని విమర్శించారు మిర్చి పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందించాలని ఆహోర పంటలు దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.30 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు పంట నష్టాలను తక్షణమే నమోదు చేసి రైతులకు న్యాయం చేయాలని పంటల బీమా పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని కోరారు ప్రభుత్వం స్పందించకపోతే బాధిత రైతులను సమీకరించి జిల్లా కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ కార్యదర్శి బొంతు రాంబాబు నాయకులు మడిపల్లి గోపాలరావు దొండపాటి నాగేశ్వరరావు కిలారు సురేష్ తుళ్లూరు రమేష్ పాపినేని రామనర్సయ్య రైతులు పాల్గొన్నారు.

తెలంగాణలో జనసేన రాజకీయ సమరశంఖం

- చింతకానిలో ప్రచార రథంతో గ్రామగ్రామాన హోరు

- పట్టభద్రుల సమస్యలే ప్రధాన అజెండాగా జనసేన సైనికుల ప్రచార పర్వం



చింతకాని నవంబర్ 27 విజన్ ఆంధ్ర.వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వేళ చింతకాని మండలంలో జనసేన శ్రేణులు ప్రచార జోరును పెంచాయి. ప్రచార రథంతో గ్రామగ్రామాన చుట్టేస్తూ రాజకీయ సందడి సృష్టించాయి. డాక్టర్ గడల శ్రీనివాసరావు గెలుపును ఆకాంక్షిస్తూ పట్టభద్రుల మద్దతు కూడగట్టే దిశగా జనసేన నాయకులు విస్తృత ప్రచారం చేపట్టారు. మధిర నియోజకవర్గ నాయకుడు తాళ్లూరి దేవిడ్ సారథ్యంలో చింతకాని మండల కోఆర్డినేటర్ చింతాల నరేష్ వర్మ నేతృత్వంలో ప్రచార కార్యక్రమం కొనసాగింది. గ్రామాల్లో ప్రచార రథం ద్వారా ప్రజలను ఆకర్షిస్తూ పట్టభద్రులు యువతను నేరుగా కలిసి వారి సమస్యలను ప్రస్తావించారు. నిరుద్యోగ సమస్య ఉద్యోగాల భర్తీ ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత ఆశలు పట్టభద్రుల హక్కుల పరిరక్షణ వంటి అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లారు. ఈ సమస్యలపై డాక్టర్ గడల శ్రీనివాసరావు తన గళాన్ని వినిపిస్తూ పట్టభద్రుల పక్షాన పోరాటం చేస్తారని నాయకులు వివరించారు. కేవలం ఎన్నికల ప్రచారానికే పరిమితం కాకుండా తెలంగాణలో జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. పట్టభద్రుల సమస్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకొస్తూ గ్రామస్థాయిలో పార్టీ శ్రేణులను సమీకరించే దిశగా ప్రచారం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ అమీద్ మహేష్ వెంకటేష్ శ్రీనివాసరావు తదితర జనసేన నాయకులు పాల్గొన్నారు.....

శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో ప్రత్యేక పూజలు చేసిన (మదీనాగూడ) సిద్ధార్థ న్యూరో హాస్పిటల్ చైర్మన్ డా. సిద్ధార్థ్ రెడ్డి



శంకర్‌పల్లి: నవంబర్ 27: (విజన్ ఆంధ్ర): శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో వెలసిన 11వ శబ్దానికి చెందిన మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో (మదీనాగూడ) సిద్ధార్థ న్యూరో హాస్పిటల్ చైర్మన్ డా. సిద్ధార్థ్ రెడ్డి, ఎండి ఈఎన్ టి స్పెషలిస్ట్ డా. సుజిత రెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ కార్తీకమాసం పురస్కరించుకొని కోరిన కోరికలు తీర్చే పురాతన మరకత శివాలయంలో స్వామివారికి పూజలు చేయడం అదృష్టంగా భావిస్తున్నారని చెప్పారు. అనంతరం ఆలయ చైర్మన్ కడకంచి కుమార్ యాదవ్ డాక్టర్ దంపతులను స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లికార్జున్, వైస్ చైర్మన్ సిహెచ్ నర్సింలు, క్యాషియర్ ప్రశాంత్ గౌడ్, మండల బిజెపి అధ్యక్షురాలు భయానంద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేల ఆరోగ్య పరిరక్షణతోనే అధిక దిగుబడులు సాధ్యం

- మండల వ్యవసాయ అధికారి విజయచంద్ర



షాబాద్, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర):రైతులు నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించి సుస్థిర వ్యవసాయ పద్ధతులను పాటించాలని షాబాద్ మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర సూచించారు. శుక్రవారం షాబాద్ మండలం కక్కులూరు గ్రామ పంచాయతీలో రైతులకు ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం ద్వారా వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విజయచంద్ర మాట్లాడుతూ.. భూసార పరీక్షల ప్రాముఖ్యత, భూసార ఆరోగ్య కార్డుల ఆధారంగా సమతుల్య ఎరువుల వినియోగం, సేంద్రియ ఎరువుల ప్రాధాన్యత, పంట అవశేషాల నిర్వహణ, సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ, నీటి సంరక్షణ, పంటల వైవిధ్యీకరణ, ప్రకృతి వ్యవసాయం వంటి అంశాలపై రైతులకు వివరించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ఈ యాసంగి సీజన్‌లో వరి సాగుకు బదులుగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల సాగుపై రైతులు దృష్టి సారించాలని కోరారు. అవసరానికి మించి రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించకుండా భూసార పరీక్షల ఆధారంగా సూచించిన మోతాదులోనే వాడాలన్నారు. పంట అవశేషాలను కాల్చకుండా నేలలో సేంద్రియ కర్బన శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నీటిని పొదుపుగా వినియోగిస్తూ సుస్థిర వ్యవసాయ పద్ధతులు పాటిస్తే సాగు ఖర్చులు తగ్గడంతో పాటు నేల సారాన్ని కాపాడుకొని దీర్ఘకాలికంగా అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కలాల్ కృష్ణ గౌడ్, ఉపసర్పంచ్ బేగరి యాదయ్య, ఏఈవో సి. శైలజ, పంచాయతీ కార్యదర్శి రాజేందర్, కావలి వెంకట్ రాములు, నర్సమ్మ, కావలి స్వప్న, అనసూయ, జగదీష్, నర్సింహులు, మద్దూర్ రాజు, సురేష్ తదితర రైతులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎఫ్ మర్పల్లి మండల నూతన అధ్యక్షుడిగా ఎర్ర శ్రీరామ్

- డిసెంబర్ 5న వికారాబాద్ జిల్లా మహాసభను విజయవంతం చేయాలి: కొడిగంటి మల్లికార్జున్ మాదిగ



మర్పల్లి, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర): మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్)ను గ్రామస్థాయి నుంచి మండల, జిల్లా స్థాయి వరకు సంస్థాగతంగా బలోపేతం చేయాలని ఎమ్మార్పీఎస్ వికారాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు కొడిగంటి మల్లికార్జున్ మాదిగ పిలుపునిచ్చారు.శుక్రవారం వికారాబాద్ మర్పల్లి మండల కేంద్రంలో ఎంఎస్ఎఫ్ మండల నాయకుల సమావేశం మండల అధ్యక్షుడు బక్క నవీన్ కుమార్ మాదిగ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కొడిగంటి మల్లికార్జున్ మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం సాగిన పోరాటం, మాదిగ సమాజంపై కొనసాగుతున్న వివక్ష, దండోరా ఉద్యమ చరిత్రను నేటి తరం విద్యార్థులకు వివరించాల్సిన బాధ్యత ప్రతి నాయకుడిపై ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక చైతన్యం, జాతి ఉద్యమంలోనూ భాగస్వాములు కావాలని సూచించారు.ఈనెల 5న వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ఎంఎస్ఎఫ్ జిల్లా మహాసభను విద్యార్థులు, యువత, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అదే రోజు ఎంఎస్ఎఫ్ నూతన జిల్లా కమిటీని ప్రకటించనున్నట్లు వెల్లడించారు.అనంతరం ఎంఎస్ఎఫ్ మర్పల్లి మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు.మండల అధ్యక్షుడు: ఎర్ర శ్రీరామ్,అధికార ప్రతినిధి: బి. శివమణి,ఉపాధ్యక్షుడు: బైండ్ల శ్రీకాంత్,ప్రధాన కార్యదర్శి, కార్యదర్శి, కార్యవర్గ సభ్యులను సైతం నియమించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మర్పల్లి మండల ఉపాధ్యక్షుడు దేవానందం మాదిగ, మండల నాయకులు సుభాన్ మాదిగ, మనోజ్ మాదిగ, ఆకాష్ మాదిగ, భరత్ మాదిగ, మోహన్ మాదిగ తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాండూర్‌లో ఘనంగా శ్రీ బాలాజీ దేవాలయ జీర్ణోద్ధరణ, ప్రాణప్రతిష్ఠ మహోత్సవాలు

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న పైలెట్ రోహిత్ రెడ్డి దంపతులు





తాండూరు నవంబర్ 27 (విజన్ ఆంధ్ర)శ్రీ బాలాజీ స్వామి ఆశీస్సులతో తాండూర్ నియోజకవర్గం ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి, ఆయన సతీమణి పంజుగుల ఆర్తి రెడ్డి, బాలాజీనీ వేడుకున్నారు. ఈ నేపథ్యంలో తాండూర్ పట్టణంలోని శ్రీ బాలాజీ దేవాలయంలో నవంబర్ 25 నుంచి 29 వరకు అంగరంగవైభవంగా నిర్వహిస్తున్న జీర్ణోద్ధరణ, ప్రాణప్రతిష్ఠ మహోత్సవాలకు నవంబర్ 26న పైలెట్ రోహిత్ రెడ్డి , నవంబర్ 27న ఆయన సతీమణి పంజుగుల ఆర్తి రెడ్డి గారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలాజీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పెద్దలు వారిద్దరికీ సాధరంగా స్వాగతం పలికి శాలువాతో ఘనంగా సన్మానం చేశారు.ఈ సందర్భంగా పైలెట్ రోహిత్ రెడ్డి మాట్లాడుతూ.. శ్రీ బాలాజీ స్వామి కృపతో ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, ఐశ్వర్యం వెల్లివిరియాలని కోరుకున్నారు. ఇలాంటి పవిత్ర ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తుల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటానికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు..ఈ సందర్భంగా పంజుగుల ఆర్తి రెడ్డి మాట్లాడుతూ.. శ్రీ బాలాజీ స్వామి దర్శనం చేసుకోవడం, ఈ పవిత్ర మహోత్సవంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. స్వామివారి ఆశీస్సులు తాండూర్ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. నవంబర్ 25 నుంచి 29 వరకు నిర్వహిస్తున్న ఈ మహోత్సవాల్లో భక్తులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని రాజస్థానీ ప్రగతి సమాజ్, రాజస్థానీ మహిళా మండలి, మార్వాడీ యువ మంచ్ ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ పట్టణ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరుకుల నరేందర్ గౌడ్‌తో పాటు బీఆర్ఎస్వీ నాయకులు దత్తు, సందీప్ కొర్రా, వినోద్, అశ్వక్, సోహెల్, అబ్రార్ లాల, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలి

- విలువైన ప్రాణాలు కాపాడుకోవాలి

- నందిగామ సబ్ ఇన్స్పెక్టర్ సుశీల

- నందిగామలో వాహనాల తనిఖీలు నిర్వహించిన పోలీసులు





నందిగామ:నవంబర్ 27(విజన్ ఆంధ్ర న్యూస్); ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని, తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని నందిగామ సబ్ ఇన్స్పెక్టర్ సుశీల వాహన దారులకు సూచించారు.లా అండ్ ఆర్డర్ పరిరక్షణతో పాటు ప్రజల క్షేమం కోసం నిత్యం పరితపించే నందిగామ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ వీరబాబు నేతృత్వంలో సబ్ ఇన్స్పెక్టర్ సుశీల రోడ్డు భద్రతలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.ఉద్యోగ భద్రతే కాకుండా ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ముందుకు అడుగులు వేస్తూ పోలీసులుగా మేమున్నామంటూ వాహనదారుల కుటుంబాలకు భరోసా కల్పిస్తున్నారు.శుక్రవారం సాయంత్రం నందిగామ పాత జాతీయ రహదారి తహసిల్దార్ కార్యాలయం ముఖ్యకూడలిలో వాహనాల తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులకు హెల్మెంట్ వాడకం పట్ల అవగాహన కల్పిస్తూ,వాహనాల రిజిస్ట్రేషన్ పత్రాలు,లైసెన్స్,పొల్యూషన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు.లేనివారికి చలాన్లు వేశారు.ద్విచక్ర వాహన దారులు ఇరువురు తలకు హెల్మెట్ ధరిస్తే రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయం నుండి బయటపడే ఆస్కారం ఉందన్నారు.హెల్మెట్ ధరించలేక పోవడంతో ఇటీవల కాలంలో ఎంతోమంది యువకులు ప్రాణాలు కోల్పోయి తల్లిదండ్రులకు పుత్రశోకశే మిగిల్చారని ఆమె విచారం వ్యక్తం చేశారు.వాహనాల తనిఖీలో ఎస్సైతో పాటు ఏఎస్ఐ శ్రీనివాస్,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీసీ రాష్ట్ర ఇన్చార్జితో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి భేటీ.

- ఇన్చార్జి బి ఎం సందీప్ కుమార్‌కు ఎమ్మెల్యే అభినందనలు



తాండూరు నవంబర్ 27 (విజన్ ఆంధ్ర) నూతనంగా నియమితులైన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ బి.ఎం. సందీప్ కుమార్ తో తాండూరు శాసనసభ్యులు బుయ్యని మనోహర్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సందీప్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. అనంతరం ఈ సందర్భంగా ఇరువురు నేతలు కాసేపు సమావేశమై తాండూరు నియోజకవర్గంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై సమీక్షించారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, సంస్థాగత నిర్మాణం, రాబోయే రోజుల్లో అనుసరించాల్సిన భవిష్యత్ కార్యాచరణ తదితర కీలక అంశాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మనిషికి మానసిక ప్రశాంతత

- ఎలుగంటి మధుసూదన్ రెడ్డి

షాబాద్,నవంబర్ 27 (విజన్ ఆంధ్ర) ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుని, దైవభక్తితో జీవించాలని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి అన్నారు.షాబాద్ మండలంలోని అంతారం గ్రామంలో స్థానిక సర్పంచ్ ఈగ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడి పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎలుగంటి మధుసూదన్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని, ఆధ్యాత్మిక భావాలతో మానసిక ప్రశాంతతను పొందాలని సూచించారు. భక్తి, ఆధ్యాత్మికత మనిషికి మంచి మార్గాన్ని చూపుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, సర్పంచులు రాజేందర్ రెడ్డి, అశోక్, సవిత సుభాష్ చంద్ర, బండ స్వరూప మహేందర్ గౌడ్, కర్రోళ్ల శాంతమ్మ యాదయ్య, నాయకులు గౌరీశ్వర్ ముదిరాజ్, అత్తిలి శ్రీనివాస్ రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీపాల్ రెడ్డి, రాజు రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



అవినీతి చెదలు “”పుట్ట”” విప్పేదెప్పుడో..?

- అక్రమార్కుడు అవినీతిపై అధికారుల మౌనం ఏంటి..?
- లక్షల మింగిన రాక్షసుడు పై చర్యలేవా ....
- ఉపాధి పేరుతో దోచుకుంటున్న ఓ ఉద్యోగి బాగోతం...
- ఉపాధి మస్టర్స్ హాజరు లో పేర్లు గోల్ మాల్....
- అందిన కాడికి దోచుకుంటున్న దుస్థితి...
- చోద్యం చూస్తున్న జిల్లా ఉన్నతాధికారులు...



బోనకల్ నవంబర్ 27 విజన్ ఆంధ్ర.వేయి కాదు రెండు వేయిలు కాదు ఏకంగా లక్షల రూపాయలు అక్రమంగా వక్రమార్గంలో జేబులు నింపుకుంటున్నన ఓ ఉద్యోగి అవినీతి చెదలు ‘పుట్ట ను అధికారులు ఎప్పుడు విప్పుతారోనని స్థానికులు ఎదురుచూస్తున్న దుర్మార్గపు పరిస్థితులు నెలకొన్నాయి వివరాలు మేరకు మండల పరిధిలోని రామాపురం గ్రామంలో ఉపాధి హామీ పథకంలో పని చేసే ఓ ఉద్యోగి వ్యాహారం అలష్యంగా వెలుగు లోకి వచ్చింది సదురు ఉద్యోగి చెప్పే మాటలు శ్రీరంగనీతులు దూరేటివి అన్ని మరో తరహా చందంగా ఉన్నట్టుగా సందేహం లేదనిపిస్తుంది గ్రామం లో ఉపాధి హామీ పథకం లో పనికిరానటువంటి వ్యాపారస్తులకు, తన అనుచరులకు, కుటుంభీకులకు ఏకంగా ఉపాధి హామీ పనికి వచ్చినట్లు హాజరు మస్టర్స్ వేసి లక్షల మింగుతున్న అక్రమార్కుడు అవినీతి కి హద్దే లేకుండా పోయిన దౌర్భాగ్య దుస్థితి నెలకున్నయని విమర్శలు వెలువెత్తుతున్నాయి గ్రామం లో గత కొన్నేళ్లు నుంచి తాను ఆడిందే ఆట పాడిందే పాటగా అదురు బెదురు లేకుండా నేనే మోనార్కిని నన్నెవరూ ఏమి చేయలేరని అనుకున్నాడెమో కానీ ప్రభుత్వ ఖజానాను గండి కొడుతూ వక్రమార్గంలో లక్షలు మింగుతున్న అవినీతి రాక్షసుడు వ్యవహారం పుట్టగొడుగుల విస్తరించి పోయిందని దాని పొట్ట ఇప్పే దేన్నోడు అని ఎదురుచూస్తున్నమని స్థానికులు కోరుతున్నారంటే వీరి బరితెగింపు ఏ స్థాయిలో ఉందో చూస్తే అర్థమవుతుంది కొన్ని సంవత్సరాల నుంచి తన సొంత పొలం లో పనులకు కూడా ఉపాధి హామీ పనికి వచ్చే కూలీలను ఉపయోగించుకొని పనులు చేపించుకుంటూ వారికీ మస్టర్స్ వేసిన సందర్భాలు కూడా లేకపోలేదు అంతేకాకుండా గ్రామంలో కనీసం ఉపాధి హామీ పథకం పని వైపు తొంగి చూడని వారికి కూడా మస్టర్స్ వేసి తద్వారా వచ్చే డబ్బులను యమ దర్జాగా జేబులు నింపుకుంటున్న సందర్భాలు కూడా కోకొల్లాలుగా ఉన్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ఇదేమిటని ఎవరైనా కూలీలు ప్రశ్నిస్తే వారిపై చిందులేస్తూ కయ్యానికి కూడా కాలు దువ్వే పరిస్థితిలు ఎన్నో సందర్భాలలో కూలీలు ఎదుర్కొన్నామని బెదిరింపులకు పాల్పడుతున్నాడని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో మెట్లు వ్యవస్థ రద్దు చేసిన గాని తాను అనుచరులను మెట్లుగా పెట్టుకొని మెట్లు పనిచేయకుండానే కొలతలు వేసి పబ్బం గడుపుకుంటున్నాడని వారు వాపోతున్నారు ఇట్లాంటి దుర్మార్గపు ఓ ఉద్యోగి అక్రమాలపై అధికారులు మౌనంగా ఉండటం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు అధికారులు ఏమైనా రహస్య ఒప్పందాలు చేసుకొని కాసులు కక్కుర్తి పడ్డారేమో తెలీదుగానీ ఇంత అక్రమ బరితెగింపును ఎందుకు విచారణ చేసి చర్యలు తీసుకోవడం లేదు అనుమానలు ఉత్పన్నమవుతుందని ఇది అంతుబట్టని సమస్యగా మారిందని పలువురు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అక్రమంగా వక్రమార్గంలో లక్షల మింగిన అవినీతి రాక్షసుడు పై పూర్తిస్థాయిల విచారించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు

విచారించి చర్యలు తీసుకుంటాం...

ఎంపీడీవో రమాదేవి

ఉపాధి హామీ పథకంలో అవినీతి చెదలు పుట్ట ఇప్పేదెప్పుడో....లక్షల మింగిన రాక్షసుడు అనే కథనంపై ఎంపీడీవో రమాదేవిని విజన్ ఆంధ్ర ప్రతినిధి వివరణ కోరగా పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు....

అయ్యప్ప స్వామి మహాపడి పూజలకు పట్నం అవినాష్ రెడ్డికి ఆహ్వానం



షాబాద్, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర): మొయినాబాద్ మండలంలో నిర్వహించనున్న అయ్యప్ప స్వామి మహాపడి పూజ కార్యక్రమాలకు హాజరుకావాలని మాజీ జెడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డికి శుక్రవారం ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా గురుస్వాములు ఆయనను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.డిసెంబర్ 2వ తేదీన మొయినాబాద్ మండలం కనకమామిడి గ్రామానికి చెందిన పొద్దుటూరి రామ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న అయ్యప్ప స్వామి మహాపడి పూజకు, డిసెంబర్ 3వ తేదీన బకారం గ్రామంలో సర్పంచ్ ఎలగోని వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాపడి పూజకు హాజరుకావాలని కోరారు.

శ్రీ బావిగి భద్రేశ్వర ఆలయ చైర్మన్ గా మేడి మహేష్ నియామకం

- 9 మందితో ఆలయ కమిటీ ఏర్పాటు, మూడేళ్ల పాటు పదవి కాలం
- ఉత్తర్వులు జారీ చేసిన దేవాలయ శాఖ



తాండూరు నవంబర్ 27 (విజన్ ఆంధ్ర): తాండూరు పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి ఆలయానికి పాలకవర్గాన్ని నియమిస్తూ దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తొమ్మిది మందితో ఏర్పాటైన ఈ పాలకవర్గం మూడేళ్ల పాటు కొనసాగనుంది. మేడి మహేష్ రెండోసారి చైర్మన్గా నియమితులయ్యారు. ఆలయ అభివృద్ధి, పునరుద్ధరణ పనులు, నిత్య పూజా కార్యక్రమాలు, భక్తుల సౌకర్యాల కల్పన, ఆలయ ఆస్తుల పరిరక్షణ బాధ్యతలను నూతన పాలకవర్గం చూసుకోనుంది. మేడి మహేష్, మడపతి శివకుమార్, లింగమంతుల శంకర్, కొర్వార్ అంజలి, అగ్గనూర్ సంకేత్, గంగా శ్రవణ్ కుమార్, శెట్టి చంద్రకాంత్, కొర్వార్ సాయి కుమార్, గజుల విజయ్ కుమార్. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డికి చైర్మన్ మేడి మహేష్ కృతజ్ఞతలు తెలిపారు. నూతన పాలకవర్గానికి భక్తులు, నాయకులు అభినందనలు తెలిపారు.

రాళ్లగూడెంలో క్రీడలకు పెద్దపీట

- 24 గంటల క్రికెట్, షటిల్ నెట్స్
- ఉదయం కరాటే శిక్షణ

చర్ల, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర): చర్ల మండలంలో ఎన్నడూ లేని విధంగా వినూత్న ఆలోచనతో క్రీడాకారులకు, యువతకు చక్కని క్రీడా వేదిక అందుబాటులోకి వచ్చింది, ఒక పంచాయతీకి ఉండవలసిన ఆదర్శవంతమైన లక్షణాలతో గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్న సర్పంచ్ కావుల శారద ప్రత్యేక చొరవతో క్రీడలు, ఆత్మరక్షణ శిక్షణకు ప్రాధాన్యతనిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.కేశవపురం పంచాయతీ పరిధిలోని రాళ్లగూడెం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రికెట్ నెట్ మరియు షటిల్ నెట్స్ ప్రతిరోజూ 24 గంటల పాటు తెరిచి ఉండి క్రీడాకారులకు నిరంతరం అందుబాటులో ఉంటాయని ,దీనికి తోడడ చిన్నారులలో ఆత్మరక్షణ నైపుణ్యాలు మరియు క్రమశిక్షణ పెంపొందించేందుకు ప్రతిరోజూ ఉదయం 5 గంటల నుండి ప్రత్యేకంగా కరాటే శిక్షణ కూడా ఇవ్వబడుతుందని నిర్వహక్కులు తెలియజేసారు .ఈ సదుపాయాలను వినియోగించుకోవడానికి క్రీడాకారులు మాత్రం ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేకుండా పూర్తి ఉచితంగా కల్పించారు, అయితే, ఆటగాళ్లు తమకు అవసరమైన బ్యాట్, బాల్ మరియు ఇతర క్రీడా సామగ్రిని స్వయంగా తెచ్చుకోవాల్సి ఉంటుంది,కరాటే శిక్షణ లో మాత్రం వివరాల కోసం కరాటే మాస్టర్ ను సంప్రదించాలని, కావున చర్ల మండల ప్రజలు, ఉద్యోగులు, క్రీడాకారులు మరియు యువత ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.



పాత పాల్వంచలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా సభలో పాల్గొన్న కొత్వాల, కార్పొరేటర్ విమలాదేవి





పాల్వంచ ప్రతినిధి నవంబర్ 27(విజన్ ఆంధ్ర) తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నదని డిసిఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమానమోదు ప్రక్రియలో భాగంగా శుక్రవారం పాల్వంచ పట్టణ పరిధిలోని పాతపాల్వంచ 46వ డివిజన్లో నమోదు ప్రక్రియను కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి తో కలిసి కొత్వాల ప్రారంభించారు. సిబ్బంది చేస్తున్న ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్వాలమాట్లాడుతూ బలహీన వర్గాల శ్రేయస్సుకై అనేక పథకాలు చేపడుతున్నదని అన్నారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంవలన ఆర్థిక స్వాలంబన చేకూరుతుందన్నారు. ప్రజలు కాంగ్రెస్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వానికి అండగా నిలవాలని కొత్వాల అన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి, వార్డ్ ఆఫీసర్ దామెర్ల నరేష్, ఎ.ఇ. నవీన్, వివిధ డివిజన్ లకు చెందిన వార్డ్ ఆఫీసర్లు సందీప్, నరేష్, ప్రశాంత్, రవీందర్, వరుణ్, ఆర్.పి.లు అరుణ, నాగమణి, పుష్ప, కాంగ్రెస్ నాయకులు ఎస్.ఖాజామియా, కరీం, బొందిల శేషగిరి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కళ్యాణ మండప రజతోత్సవ వేడుకలకు మంత్రి తుమ్మలకు ఆహ్వానం



సత్తుపల్లి, నవంబర్ 27, విజన్ ఆంధ్ర : సత్తుపల్లి పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండప రజతోత్సవ (25 ఏళ్ల) వేడుకలు ఈ నెల 29వ తేదీన ఘనంగా జరగనున్నాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరుకావాల్సిందిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ని ఆర్యవైశ్య కళ్యాణ మండప కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. దమ్మపేట మండల పరిధిలోని గండుగులపల్లిలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ని కలిసిన ఆర్యవైశ్య కళ్యాణ మండప సభ్యులు గుడిమెట్ల గాంధీ, వనమా వాసు, నడిపల్లి లక్ష్మీనారాయణ,మరియు ఇతర కమిటీ సభ్యులు వేడుకల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వేడుకల వివరాలను మంత్రికి వివరించారు.

ఇందిరమ్మ జీవిత భీమా ప్రోగ్రాంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు

పాల్వంచ ప్రతినిధి నవంబర్ 27(విజన్ ఆంధ్ర) : పాల్వంచ మండలం బసవతారక కాలనీ గ్రామపంచాయతీలో నిర్వహించిన ఇందిరమ్మ జీవిత భీమా ప్రోగ్రాం కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో గౌరవ సర్పంచ్ , గౌరవ వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గంగిరెడ్డి భువన సుందర్ రెడ్డి , ముఖ్య అతిథిగా హాజరై, ఇందిరమ్మ జీవిత భీమా ప్రోగ్రాం యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు.ప్రజలందరూ ఈ భీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ పథకం ఎంతో భరోసా కల్పిస్తుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గారు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

